Email:prajamantalu@gmail.com

www.prajamantalu.com

సంపుటి : 4
సంచిక : 83

బుధవారం,
సెప్టెంబర్,6,2023

# ప్రజా మంటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

పేజీలు - 8 వెల - రూ 5 : 00

ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak, Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yadadri Bhuvanagiri

## యూనివర్శిటీ సభలో
# జారిపడిన సిఎం నితీశ్



పాట్నా,సెప్టెంబర్,4: బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ పాట్నా యూనివర్శిటీ క్యాంపస్‌లో జరిగిన కార్యక్రమంలో వేదికపై జారి పడ్డారు. వెంటనే సెక్యూరిటీ సిబ్బంది జోక్యం చేసుకుని ఆయనను పైకి లేవనెత్తారు. ఉపాధ్యా య దినోత్సవం సందర్భంగా మంగళవారం యూ నివర్శిటీ క్యాంపస్‌లో కార్యక్రమం జరిగింది. వేది కపై ఉన్న శిలాఫలకం ఆవిష్కరణ సందర్భంగా ఆ యన అటువైపు వెళ్తుండగా అదుపు తప్పి జారిప డ్డారు. అంతకు ముందే గవర్నర్ రాజేంద్ర అర్లేకర్ ఆ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అయితే ఈ సంఘటనలో సిఎం నితీశ్‌కు ఎలాంటి గాయాలు తగలలేదు.



# రాష్ట్రంలో అగ్నిమాపక సామాగ్రి తయారీ ప్లాంట్

## దుబాయ్‌లో కెటిఆర్ పర్యటన..

### తెలంగాణకు మరో భారీ పెట్టుబడి
### రూ.700 కోట్ల రూపాయలను పెట్టుబడిగా పెట్టేందుకు ముందుకు వచ్చిన యుఎఇ దిగ్గజ సంస్థ నాఫ్కో
### తెలంగాణలోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్ స్ట్రక్షన్‌తో కలిసి,అంతర్జాతీయ స్థాయి ఫైర్ సేఫ్టీ ట్రైనింగ్ అకాడమీని ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చిన సంస్థ



*హైదరాబాద్,సెప్టెంబర్,5: దుబాయిలో మంత్రి కెటిఆర్ పర్యటన విజయవంతంగా ప్రారంభమైంది. తన పర్యటనలో భాగంగా పలు కంపెనీల ప్రతినిధులతో మంత్రి కెటిఆర్ సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా తెలంగాణ రాష్ట్రానికి భారీ పెట్టుబడితో మంత్రి కెటిఆర్ తన పర్యటన ప్రారంభించారు. అగ్నిమాపక సామాగ్రి తయారీలో ప్రపంచవ్యాప్తంగా పేరు పొందిన యూఏఈ దిగ్గజ సంస్థ నాఫ్కో కంపెనీ తెలంగాణ రాష్ట్రంలో రూ.700 కోట్ల రూపాయలను పెట్టుబడిగా పెట్టేందుకు ముందుకు వచ్చింది.*

ఈ మేరకు మంత్రి కెటిఆర్‌తో జరిగిన సమావేశంలో నాఫ్కో సిఇవో ఖాలిద్ అల్ ఖతిబ్ ప్రతినిధి బృందం సమావేశమైంది. తెలంగాణ రాష్ట్రంలో తమ అగ్నిమాపక సామాగ్రిని తయారు చేయనున్నట్లు సంస్థ తెలిపింది. ఇందులో భాగంగా రూ.700 కోట్లు రూపాయల భారీ పెట్టుబడిని పెడుతున్నట్లు వెల్లడించింది. తెలంగాణతో పాటు భారతదేశం విస్తృతంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో అగ్నిమాపక సామాగ్రి, అగ్నిమాపక సేవల అవసరం రానున్న భవిష్యత్తులో భారీగా పెరుగుతుందని విశ్వాసం తమకుందని నాఫ్కో తెలిపింది. తెలంగాణలో ఏర్పాటు చేయనున్న అగ్నిమాపక సామాగ్రి తయారీ ప్లాంట్ భారతదేశ డిమాండ్‌ను సరిపోతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. దీంతోపాటు తెలంగాణలోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్‌తో కలిసి అంత ర్జాతీయ స్థాయి ఫైర్ సేఫ్టీ ట్రైనింగ్ అకాడమీ ఏర్పాటు చేయాలన్న మంత్రి కెటిఆర్ ప్రతిపాదనకు కంపెనీ అంగీకారం తెలిపింది. ఈ ట్రైనింగ్ అకాడమీ ద్వారా దాదాపు 100పైగా దేశాలలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న తమ సంస్థ నైపుణ్యాన్ని, అగ్నిమాపక శిక్షణను తెలంగాణ కేంద్రంగా అందించేందుకు సిద్ధంగా ఉన్నామని సంస్థ సిఇవో మంత్రి కెటిఆర్‌కి తెలిపారు. అమెరికాలో పర్యటించిన కెటిఆర్ పలు మల్టినేషనల్ కంపెనీలతో ఒప్పందాలు చేసుకున్నారు. పెట్టుబడులకు మార్గం సుగమం చేశారు. తిరిగి వస్తున్న సమయంలో దుబాయ్‌లో ఆగి రాష్ట్రం కోసం మరిన్ని పెట్టుబడులను ఆకర్షిస్తున్నారు.

## హైదరాబాద్‌లో...
# వర్ష బీభత్సం...

### నాలాలో పడి కొట్టుకుపోయిన బాలుడు
### హైదరాబాద్‌లో ఎడతెరిపి లేకుండా వాన - జనజీవనం అస్తవ్యస్తం
### బాచుపల్లి పరిధిలోని ఎన్నారై కాలనీ వద్ద నాలాలో పడిన బాలుడు
### నిజాంపేట రాజీవ్ గృహకల్ప వద్ద మృతదేహం
### బయటికి తీస్తుండగా మళ్లీ కొట్టుకుపోయిన మృతదేహం...



హైదరాబాద్,సెప్టెంబర్,5: హైదరాబాద్ నగరంలో వర్ష బీభత్సం కొనసాగుతోంది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో నాలాలు ఉప్పొంగుతున్నాయి. ఈక్రమంలో ఓబాలుడు నాలాలో పడి కొట్టుకుపోయిన ఘటన విషాదాంతం అయింది. నిజాంపేట రాజీవ్ గృహకల్ప వద్ద ఆ బాలుడి మృతదేహం తేలింది. కానీ అక్కడ్నించి మరోసారి కొట్టుకుపోయింది. బాచుపల్లి పరిధిలోని ఎన్నారై కాలనీ వద్ద ఆ బాలుడు నాలాలో పడిపోయాడు. బాలుడి కోసం తీవ్రస్థాయిలో గాలింపు చేపట్టారు. నిజాంపేట రాజీవ్ గృహకల్ప వద్ద బాలుడి మృతదేహాన్ని గుర్తించిన అధికారులు, మృతదేహాన్ని బయటికి తీస్తుండగా, నీటి ఉద్ధృతికి మళ్లీ కొట్టుకుపోయింది. బాలుడి మృతదేహం నాలా ప్రవాహంతో పాటు తుర్క చెరువులోకి కొట్టుకుపోయింది. దాంతో అధికారులు గజ ఈతగాళ్లను రంగంలోకి దించారు. వారితో తుర్క చెరువులో గాలింపు చేపట్టారు

# సమరానికి సై..!

## హైదరాబాద్ కేంద్రంగా...
## కాంగ్రెస్ కీలక నిర్ణయం..?

హైదరాబాద్,సెప్టెంబర్,5: కాంగ్రెస్ నాయకత్వం తెలంగాణలో గెలుపు ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. రాష్ట్రంలో ఎన్నికల వేళ కీలక నిర్ణయం తీసుకుంది. పార్టీ అగ్రనాయకత్వం హైదరాబాద్ తరలి రానుంది. కర్ణాటక తరువాత తెలంగాణలో అధికారం దక్కించుకోవాలనే లక్ష్యంతో అడుగులు వేస్తోంది. అందులో భాగంగా హైదరాబాద్ కేంద్రంగా తెలంగాణ రాష్ట్ర రాజకీయాలపై పూర్తి స్థాయిలో దృష్టి సారించనుంది. ఇందుకు వ్యూహాత్మకంగా ముహూర్తం ఎంపిక చేసింది.

కాంగ్రెస్ కీలక అడుగులు: తెలంగాణలో ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నాయకత్వం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. అందులో భాగంగా.. సెప్టెంబరు 16న హైదరాబాద్ వేదికగా కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ(సీడబ్ల్యూసీ) సమావేశం జరపాలని నిర్ణయించారు. సీడబ్ల్యూసీ కార్యవర్గ పునర్ వ్యవస్థీకరణ అనంతరం జరుగుతున్న తొలి సమావేశం ఇదే. సెప్టెంబరు 17న హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనమైన రోజు కావడంతో ఆ వేడుకల్లో సోనియాగాంధీ ముఖ్య అతిథిగా పాల్గొంటారు. రాష్ట్ర ఏర్పాటు కోసం కాంగ్రెస్ చేసిన త్యాగాలేమిటో సోనియా ప్రజలకు వివరించనున్నారు. తెలంగాణ ఏర్పాటులో అత్యంత కీలక పాత్ర పోషించిన సోనియానే హైదరా బాద్ వేదికగా జరిగే కార్యక్రమంలో పాల్గొని ప్రజలకు సందేశం ఇవ్వనున్నారు. పార్టీ ముఖ్య నేత కేసీ వేణుగోపాల్ సీడబ్ల్యూసీ సమావేశ నిర్వహణపైన స్పష్టత ఇచ్చారు. ఎన్నికల సమర శంఖం: గత ఏడాది సెప్టెంబర్ 17న కేంద్ర హోం మంత్రి హైదరాబాద్ వేదికగా విమోచన దినోత్సవం నిర్వహించారు. ఈ సారిఅదే రోజున కాంగ్రెస్ నాయకత్వం తెలంగాణ ఎన్నికల సమర శంఖం పూరించనుంది. ప్రధాని జన్మదినం కూడా అదే రోజు కావటంతో ఈ నిర్ణయం పైన రాజకీయంగా ఆసక్తి పెరుగుతోంది. సెప్టెంబర్ 16న హైదరాబాద్ లో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం నిర్వహించాలని ఏఐసీసీ నిర్ణయించింది. మరుసటి రోజున సెప్టెంబరు 17న సీడ్ల్యూసీ సభ్యులతో పాటు,కాంగ్రెస్ పార్టీ రాష్ట్రాల అధ్యక్షులు, సీఎల్పీ నాయకులు, పార్లమెంటరీ పార్టీ నాయకుల సమావేశం జరగనుంది. అదే రోజు సాయంత్రం హైదరాబాద్ లో కాంగ్రెస్ పార్టీ భారీ బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నారు. ఈ సభలో పార్టీ అధికారంలోకి వస్తే అమలు చేసే గ్యారంటీ స్కీంలను ప్రకటించనున్నారు. ఎన్నిక మేనిఫెస్టో:ఈ సభ ద్వారా పార్టీ తెలంగాణ ఎన్నికల ప్రచారం ప్రారంభించనుంది. ఇప్పటికే కేసీఆర్ తన పార్టీకి చెందిన 115మంది అభ్యర్థులను ప్రకటించారు. కాంగ్రెస్ తమఅభ్యర్థుల ఎంపిక కసరత్తు ముమ్మరం చేసింది. బహిరంగలో పార్టీ అగ్రనాయకత్వం పాల్గొంటుంది. 5గ్యారంటీలతోపాటు,బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలపైచార్జ్ షీట్‌లతో ఇంటింటి ప్రచారం నిర్వహించేలా నిర్ణయించారు.

## అమితాబ్ బచ్చన్ కు బీసీసీఐ
# 'గోల్డెన్ టికెట్'

### స్వయంగా వరల్డ్ కప్ గోల్డెన్ టికెట్ అందించిన బీసీసీఐ కార్యదర్శి జై షా



న్యూఢిల్లీ,సెప్టెంబర్,5: బాలీవుడ్ నట దిగ్గజం అమితాబ్ బచ్చన్ క్రికెట్ కు వీరాభిమాని అని తెలిసిందే. టీమిండియా ఆడే మ్యాచ్ లు, సిరీస్‌లను ఆయన క్రమం తప్పకుండా అనుసరిస్తుంటారు. అంతేకాదు, టీమిండియాను ఎవరైనా తప్పుగా విమర్శిస్తే వారిని ఓ చూపు చూస్తుంటారు. ఈ నేపథ్యంలో, అమితాబ్ బచ్చన్ ను భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు (బీసీసీఐ) విశిష్ట రీతిలో గౌరవించింది. ఆయనకు వరల్డ్ కప్-2023 గోల్డెన్ టికెట్ ను ప్రదానం చేసింది. ఈ గోల్డెన్ టికెట్ ను బీసీసీఐ కార్యదర్శి జై షా... అమితాబ్ కు స్వయంగా అందించారు. దీనిపై బీసీసీఐ ఎక్స్ లో స్పందించింది. "మన గోల్డెన్ ఐకాన్ కు గోల్డెన్ టికెట్ ఇస్తున్నాం.

# పనులు చేశాం... మరోసారి ఆశీర్వదించండి: మంత్రి కొప్పుల

### మాది చేతల ప్రభుత్వం- మీలో ఒక్కడిని ..తుది శ్వాస వరకు మీతోనే ఉంటా .మళ్ళీ గెలిపించండని,
### ప్రజా ఆశీర్వాద యాత్రలో మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రజలను కోరారు.
### ఆయనకు మహిళలు బతకమ్మ లతో, అడుగడుగునా జననీరాజనం పలికారు

గొల్లపల్లి సెప్టెంబర్ 05 (ప్రజామంటలు) :: గత 50 ఏళ్ల ఆంధ్ర పాలకుల హయాంలో అన్ని విధాలుగా వివక్షను ఎదుర్కొన్న తెలంగాణ రాష్ట్రం ఈ పదేళ్ల కాలంలో అన్ని రంగాల్లో అభివృద్ధిలో దూసుకుపోతూ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా తీర్చిదిద్దామని, మాటలతో కాలం వెలిబుచ్చక చేతుల ప్రభుత్వాన్ని నిరూపించామని, పనులు చేసిన మమ్మల్ని మరోసారి ఆశీర్వదించాలంటూ మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రజలను అభ్యర్థించారు .మంగళవారం గొల్లపల్లి మండలం లొత్తునూరు గ్రామంలో ప్రజా ఆశీర్వాద యాత్రను మంత్రి ప్రారంభించారు. అనంతరం బొంకూర్ ,అబ్బాపూర్ గ్రామాల్లో స్థానిక బిఆర్ఎస్ శ్రేణులతో కలిసి ప్రజా ఆశీర్వాద యాత్రను

## ప్రజానాడి






మంత్రి నిర్వహించారు .ఆయా గ్రామాల్లో మంత్రికి స్థానిక ప్రజలు, బిఆర్ఎస్ శ్రేణులు ఘన స్వాగతం పలకగా మహిళలు బతుకమ్మలతో ఘన స్వాగతం పలికారు. డబ్బు చప్పులు ,బైండ్ల వారు డమరుకనాదాలతో స్వాగతం పలికారు .ఆయా గ్రామాల్లో గడపగడపకు తిరుగుతూ తనకు ఈసారి మద్దతు తెలపాలని కోరుతూ సబ్బండ వర్గాల ప్రజా సంక్షేమం కోసం అమలు చేస్తున్న ప్రజాసంక్షేమ పథకాల గూర్చి, చేస్తున్న అభివృద్ధి పనులకు వివరిస్తూ ముందు కదలారు. వృద్ధులను, చిన్నారులను ,యువతి యువకులను ,మహిళలను వారి యోగక్షేమాలు తెలుసుకుంటూ వారి కెరీర్ గురించి అడుగుతూ తనకు ఈ దఫా అండగా నిలవాలని అభ్యర్థించారు .అడుగడుగునా మంత్రికి జననీరాజనాలు పలికారు .ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో మంత్రి ప్రజలనుదేశించి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ హయాంలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని ,అభివృద్ధిలో ప్రజాసంక్షేమ పథకాలను అమలు చేస్తున్న రాష్ట్రాలలో తెలంగాణ రాష్ట్రం నెంబర్ వన్ గా నిలిచిందని , తను మంత్రిగా, ఎమ్మెల్యేగా కాకుండా మీలో ఒకడిగా, అతి సాధారణ వ్యక్తిగా తుదిశ్వాస వరకు మీతోనే ఉంటూ మీకు సేవ చేసే మహాభాగ్యం మరోసారి కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి సమక్షంలో పలువు బిఆర్ఎస్ పార్టీలో చేరగా వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు . ఈ కార్యక్రమంలో ప్యాక్స్ జిల్లా పోరం అధ్యక్షులు డాక్టర్ రాజ సుమన్ రావు, ఎల్ ఎం కొప్పుల సోషల్ ఆర్గనైజేషన్ సర్వీసెస్ చైర్మన్ కొప్పుల స్నేహ, కొప్పుల నందిని, జెడ్పిటిసి జలంధర్ ,ఎంపీపీ శంకరయ్య, వైస్ ఎంపీపీ సత్తయ్య ,ఏఎంసీ చైర్మన్ హనుమండ్లు,వైస్ చైర్మన్ లింగారెడ్డి ,బిఆర్ఎస్ మండల శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రమేష్ ,బాబు ,యూత్ అధ్యక్షుడు రవీందర్ , కన్వీనర్ రామచందర్ రెడ్డి ,ఉపాధ్యక్షుడు రాజేందర్ , బిఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షుడు చందు,సర్పంచులు పరమేశ్వరి, సత్తయ్య, నాయకులు సత్తయ్య, కొండయ్య వివిధ గ్రామాల సర్పంచ్లు, ఎంపీటీసీలు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహిళా రిజర్వేషన్ బిల్లుకు
# మద్దతివ్వండి..
## రాజకీయ పార్టీలకు కవిత లేఖ..!

### పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో ప్రధానాంశంగా తీసుకోవాలని విజ్ఞప్తి
### ప్రతిపక్ష ఇండియా కూటమి సభ్యులకూ లేఖ రాసిన ఎమ్మెల్సీ
### రాజకీయ విభేదాలను పక్కన పెట్టి ఐకమత్యంతో వ్యవహరించాలని సూచన



హైదరాబాద్,సెప్టెంబర్,5: పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదానికి కృషి చేయాలం టూ అన్ని పార్టీల ముఖ్య నేతలకు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత లేఖ రాశారు. మహిళా రిజర్వే షన్ బిల్లుకు ఈ సమావేశాల్లో ప్రాధాన్యత ఇవ్వా లని కోరారు. తెలంగాణ సీఎం కేసీఆర్ సహా మొత్తం 47రాజకీయ పార్టీల అధినేతలకు ఈ లేఖను పంపించారు. రాజకీయ విభేదాలను పక్కనపెట్టి మహిళా బిల్లు విషయంలో ఐకమత్యంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. కవిత తన లేఖలో.. లోక్‌సభ,రాష్ట్రాల శాసనసభల్లో 33 శాతం సీట్లను మహిళలకు కేటాయించాలని కోరారు. శాసనసభలో మహిళల ప్రాతినిధ్యం అవసరాన్ని నొక్కి చెప్పారు. ప్రజాస్వామ్యంలో కలుపుగోలుతనం ప్రాముఖ్యతను చెబుతూ, మహిళా ప్రాతినిధ్యాన్ని పెంచడమనేది ప్రత్యేకతతో కూడుకున్నఅంశంకాదని అన్నారు. బీజేపీ అధినేత జేపీ నడ్డా,ఎస్పీ చీఫ్ అఖిలేశ్ యాదవ్, డీఎంకే బాస్ ఎంకే స్టాలిన్, మల్లికార్జున్ ఖర్గే, వైసీపీ అధినేత వైఎస్ జగన్ సహా రాజకీయ పార్టీల అధ్యక్షులకు కవిత ప్రత్యేక లేఖ రాశారు.

# అక్కాచెల్లిని ఎత్తుకెళ్లి 10 మంది గ్యాంగ్ రేప్

రాయ్ పూర్,సెప్టెంబర్,4: రక్షా బంధన్ పండుగ రోజున ఓ దారుణ ఘటన చోటుచేసుకుంది. ఆలస్యంగా ఈ సంఘటన వెలుగు చూసింది. రక్షా బంధన్ వేడుకలు ముగించుకుని ఇంటి నుంచి తిరిగి వస్తున్న ఇద్దరు అక్కాచెల్లెళ్లపై సామూహిక అత్యాచారం చేసిన ఘటన ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్‌లో చోటుచేసుకుంది. ఈ కేసులో ఓ సీనియర్ బీజేపీ నేత కొడుకు సహా 10 మందిని పోలీసులు అరెస్టు చేశారు. ఇద్దరు అక్కాచెల్లెళ్లు తమ బంధువుల ఇంటికి వెళ్లి రాఖీ పండుగను జరుపుకున్నారు. సాయంత్రం బంధువుల ఇంటి నుంచి వారి ఇంటికి వెలుతుండగా ముగ్గురు కామాంధులు అక్కాచెల్లెళ్లను అడ్డగించి వారి వద్ద ఉన్న మొబైల్ ఫోన్లు, పర్సులు లాక్కొన్నారు. అనంతరం రోడ్డుపైనే ఆపి ఇద్దరిని వేధింపులకు గురిచేశారు. అదే సమయంలో మళ్లీ 7 మంది బైక్ లపై అక్కడికి చేరుకున్నారు.

## విశ్రాంత ఉపన్యాసకులు జైశెట్టి రమణయ్య కు సన్మానం



**జగిత్యాల సెప్టెంబర్ 05 (ప్రజామంటలు):**
జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం విశ్రాంత ఉపన్యాసకులు, చరిత్ర పరిశోధకులు నడుస్తున్న చరిత్రగా పిలువబడే జైశెట్టి రమణయ్య ను జగిత్యాల జిల్లా మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు తాటి పర్తి విజయలక్ష్మి దేవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. పుష్పగుచ్ఛం అందజేసి, శాలువా కప్పి, శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో తాటిపర్తి దేవేందర్ రెడ్డి, వీరబత్తిని శ్రీనివాస్, కమటాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

## లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోండి కేసుల నుండి పరిష్కారం పొందండి: ట్రాఫిక్ ఎస్.ఐ. రామచంద్రము




**జగిత్యాల సెప్టెంబర్ 05 (ప్రజామంటలు):**
దీర్ఘ కాలంగా పెండింగులో ఉన్న కేసుల పరిష్కారానికి ప్రభుత్వం లోక్ అదాలత్ లను నిర్వహిస్తోందని దీనిని సద్వినియోగం చేసుకొని కేసుల నుంచి విముక్తి పొందాలని ట్రాఫిక్ ఎస్.ఐ. రామచంద్రము కోరారు. మంగళవారం ట్రాఫిక్ ఎస్.ఐ. మీడియాకు ప్రకటన విడుదల చేశారు. జాతీయ లోక్ అదాలత్ ఆదేశాలతో జగిత్యాల జిల్లా న్యాయస్థానంలో ఈ నెల 2 నుంచి 9 వరకు లోక్ అదాలత్ నిర్వహిస్తున్నారన్నారు. వివిధ రకాల కేసులతో పాటు ట్రాఫిక్ కేసులను ఈ లోక్ ఆదాలత్ లో పరిష్కరించుకోవచ్చని ట్రాఫిక్ ఎస్.ఐ. తెలిపారు. జగిత్యాల ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు, పెండింగ్ చాలనులుకట్టుకొని కేసుల నుంచి విముక్తి పొందవచ్చన్నారు. వాహనదారులు సత్వరమే లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలని ట్రాఫిక్ ఎస్.ఐ. రామచంద్రము కోరారు.

## కొనసాగుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల ఆందోళన



**జగిత్యాల సెప్టెంబర్ 05 (ప్రజా మంటలు):**
సమగ్ర శిక్ష ఉద్యోగుల ఆధ్వర్యంలో గత వారం రోజులుగా జిల్లా కేంద్రంలో దీక్షలు కొనసాగిస్తున్నారు ఇది ఇలా ఉండగా మంగళవారం సెప్టెంబర్ 5 జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణ రాకముందు కేసీఆర్ ఉద్యమ సమయంలో తెలంగాణలో కాంట్రాక్టు ఉద్యోగులు ఉండరని తెలంగాణ వచ్చిన తర్వాత అందరిని ప్రభుత్వ ఉద్యోగులుగా మారుస్తామని హామీ ఇచ్చారని ఇప్పటికే కొన్ని శాఖల్లో ఒప్పంద ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా రెగ్యులరైజ్ చేశారని కానీ తమను ఇంతవరకు రెగ్యులరైజ్ చేయ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా తమ ఉద్యోగాలకు భద్రత కల్పించి ప్రభుత్వ ఉద్యోగులకు ఇస్తున్నట్లుగా తమకు కూడా అన్ని రకాల సదుపాయాలు కల్పించాలని మహిళా ఉద్యోగులకు 183 రోజుల పాటు ఇచ్చే ప్రసవ సెలవులను కూడా తమ మహిళా ఉద్యోగులకు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. తమ సమస్యలను ఇప్పటికైనా గుర్తించి ప్రభుత్వం తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని లేనట్లయితే తాము యధావిధిగా ఆందోళనలు నిర్వహిస్తామని అన్నారు.



జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండల ఆర్ఎంపీ, పీఎంపీ భవనానికి భూమి పూజ చేసిన ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, కల్వకుంట్ల సంజయ్, జెడ్పిటిసి సంధి రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీపీ సరోజనా అదిరెడ్డి. పాల్గొన్న మల్లాపూర్ మండల ఆర్.ఎం.పి పి.ఎం.పి సభ్యులు, పలువురు సర్పంచులు ఎంపీటీసీలు టిఆర్ఎస్ నాయకులు, తదితరులు

# గుప్త నిధుల కోసం గడి మైసమ్మ బురుజును కూల్చివేసిన వారిపై కేసు నమోదు చేయాలి

### - సీపీఐ (యంయల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి మాన్యపు బుజేందం



**పాలకుర్తి సెప్టెంబర్ 05 (ప్రజామంటలు):**
గుప్త నిధుల కోసం గడి మైసమ్మ బురుజును కూల్చివేసిన వారిపై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని సిపిఐ (యంయల్) జిల్లా కార్యదర్శి మాన్యపు బుజేందర్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో బుజేందర్ విలేకరులతో మాట్లాడుతూ పాలకుర్తి బొడ్రాయి వద్ద ఉన్న చారిత్రక ప్రాధాన్యత కలిగిన గడి మైసమ్మ బురుజును స్వార్థ ప్రయోజనాల కోసం కూల్చివేశారని, బురుజును కూల్చివేయడంలో కుట్ర కోణం ఉందని ఆయన అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట కాలంలో, స్వాతంత్రోద్యమ కాలంలో దోపిడీ పీడనకు వ్యతిరేకంగా స్వేచ్ఛ స్వాతంత్ర్యాలను కోరుతూ అలనాటి పోరాట యోధులు గడి మైసమ్మ బురుజుపై జాతీయ జెండాలను ఎగురవేసి దేశభక్తిని చాటారని గుర్తు చేశారు. ప్రజల పోరాటాలకు, చైతన్యానికి, చరిత్రకు, సంస్కృతికి చిహ్నంగా ఉన్న బురుజును తొలగించడం అంటే ప్రజలను అవమాన పరచడమేనని అన్నారు. ఆ బురుజు వద్ద ప్రజలు ప్రతి సంవత్సరం దసరా ఉత్సవాలు నిర్వహిస్తారని, గడి మైసమ్మకు పూజలు చేస్తారని, బురుజును తొలగించి ప్రజల విశ్వాసాలపై నమ్మకాలపై దాడి చేశారని తెలిపారు. పాలకుర్తిని ఒకవైపు పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తూనే మరోవైపు చారిత్రక కట్టడాలను, చారిత్రక ఆనవాళ్లను, సాంస్కృతిక వారసత్వ సంపదను అధికార పార్టీ అండదండలతో తొలగిస్తున్నారని తీవ్రంగా విమర్శించారు. బురుజును తొలగిస్తున్న సమాచారం తెలుసుకొని పంచాయతీ కార్యదర్శి కూల్చివేత పనులను నిలిపివేయించగా, స్థానిక ప్రజాప్రతినిధుల అండదండలతో అర్ధరాత్రి బురుజును తొలగించడం వెనక అంతర్యం ఏంటని ప్రశ్నించారు. రాత్రిపూట తొలగించడం వల్ల గుప్త నిధుల కోసం తోవ్వారని అనుమానాలు ప్రజల్లో వ్యక్తం అవుతున్నాయని, దీనిపై సమగ్ర విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు. బురుజును తీసివేయడానికి ఉపయోగించిన జెసిబిని, ట్రాక్టర్లను సీజ్ చేయాలన్నారు. బురుజు ఉన్న స్థలాన్ని కాజేయడం కోసం గడి మైసమ్మ బురుజును తొలగించారని స్థానికులు చెప్పారని, బురుజు స్థలాన్ని అన్యక్రాంతం కాకుండా చర్యలు చేపట్టాలని, దానిని ప్రజా అవసరాల కోసం ఉపయోగించాలని డిమాండ్ చేశారు. దీనిపై స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు స్పందించాలని, లేకుంటే ప్రజలు క్షమించారని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ఆ పార్టీ పాలకుర్తి మండల కార్యదర్శి జీడి సోమయ్య, జిల్లా నాయకులు రజిత, శివప్రసాద్, సారయ్య తదితరులు ఉన్నారు.

## సాయి జీనియస్ హైస్కూల్లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు






**కోరుట్ల సెప్టెంబర్ 05 (ప్రజామంటలు):**
కోరుట్ల పట్టణంలోని సాయి జీనియస్ హైస్కూల్లో సర్వేపల్లి రాధాకృష్ణ జన్మదినము పురస్కరించుకొని ఉపాధ్యాయ దినోత్సవం వేడుకను ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కరెస్పాండెంట్ చౌకి రమేష్ మాట్లాడుతూ సమాజానికి డాక్టర్స్ ను, ఇంజినీర్స్ ను, లాయర్స్ ను , సైంటిస్టు లను తమ ఉత్తమ బోధన ద్వారా అందించే వారు ఉపాధ్యాయులు అని, వాళ్ళ సేవలు మరువలేనివాని, సమాజం వారికీ అంతగానో రుణపడి ఉందని కొనియాడారు. విద్యార్థి భవిష్యత్తు తరగతి గదిలోనే నిర్మిచబడుతుంది అన్న సర్వేపల్లి రాధాకృష్ణ మాటలను గుర్తు చేశారు. ఉత్తమ ఉపాధ్యాయుడితో ఉత్తమ సమాజం నిర్మించబడుతుందని అన్నారు. ఈరోజు విద్యార్థులు ఉపాధ్యాయుల యొక్క భూమికను నిర్వహించడాన్ని ఆయన అభినందించారు. ఇట్టి సందర్భంగా విద్యార్థులు ఆనందంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, చౌకి సుధ, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## గురువును మించిన దైవం లేదు పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్

### - కరీంనగర్లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుల కు సన్మానం



**చిగురుమామిడి సెప్టెంబర్ 05 (ప్రజామంటలు):**
చిగురుమామిడి మండల కేంద్రానికి చెందిన డార్విన్ స్కూల్ కరస్పాండెంట్ సమ్మిరెడ్డి ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపిక కావడంతో మంత్రి గంగుల కమలాకర్ చేతుల మీదుగా సన్మానం పొందారు. మంగళవారం కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో ఉపాధ్యాయ దినోత్సవంలో భాగంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులకు జిల్లా కలెక్టర్ గోపి ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేయగా ముఖ్యఅతిథిగా పౌరసరఫరాల శాఖ జిల్లా మంత్రి గంగుల కమలాకర్ హాజరై మాట్లాడుతూ.... గురువును మించిన దైవం లేదని, నాడు గురువులు విద్య బుద్ధి నేర్పించడం పట్లనే ప్రతి ఒక్కరు ఈ స్థాయిలో ఉన్నామన్నారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డుతో పాటు ఘనంగా సన్మానం చేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో సంస్కృతిక చైర్మన్ మానకొండూరు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, చొప్పదండి ఎమ్మెల్యే సుంక రవి శంకర్, సుడా చైర్మన్ జీవి ఆనంద్, వివిధ ప్రజాప్రతినిధులు, విద్యాధికారులు, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## పేదలు ఆత్మగౌరవంతో బతకాలన్నదే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే సతీష్ కుమార్



**హుస్నాబాద్ సెప్టెంబర్ 05 (ప్రజామంటలు)**
అర్హులైన 260 లబ్ధిదారుల కుటుంబాలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు పంపిణీ చేశామని, మిగతా 300కు పైగా ఇండ్లను త్వరలోనే పూర్తి చేసి లబ్ధిదారులకు అందిస్తామని హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీష్ కుమార్ అన్నారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ ఎంపీడీవో కార్యాలయంలో లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పట్టాలను ఎమ్మెల్యే సతీష్ కుమార్ పంపిణీ చేశారు. నియోజకవర్గానికి గృహలక్ష్మి పథకం కింద మూడువేల ఇండ్లు మంజూరయ్యాయని, అవి లబ్ధిదారులకు కేటాయించిన తర్వాత మరో మూడు వేల ఇండ్ల మంజూరును తీసుకువస్తామన్నారు. 15 లక్షల విలువ గల డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను ముఖ్యమంత్రి కేసీఆర్ చేతిలో పెట్టారనే విషయాన్ని లబ్ధిదారులు గుర్తుంచుకోవాలన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు రాని అర్హులకు గృహలక్ష్మి పథకం కింద ఇండ్లను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. జీవో 58 కింద అర్హులైన వారికి ఇండ్ల స్థలాల పట్టాలను ఇవ్వాలని స్థానిక ఆర్డివో కు సూచించారు. ఈ కార్యక్రమంలో చైర్ పర్సన్ ఆకుల రజిత, ఆర్డిఓ బెన్ షాలోమ్, ఎమ్మార్వో రవీందర్ రెడ్డి, జడ్పీ వైస్ చైర్మన్ రాజిరెడ్డి, మార్కెట్ చైర్పర్సన్ ఎడబోయిన రజిని మార్కెట్ కమిటీ మాజీ చైర్పర్సన్ తిరుపతి రెడ్డి, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, యూత్ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ప్రొసీడింగ్ పత్రాలను పంపిణీ చేసిన ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు



**మల్లాపూర్ సెప్టెంబర్ 05 (ప్రజామంటలు):**
మల్లాపూర్ మండల కేంద్రంలో మంజూరైన యాదవ సంఘ అభివృద్ధికి రెండు లక్షల యాభై వేల రూపాయలు, వంజరి సంఘ అభివృద్ధికి రెండు లక్షల యాభై వేల రూపాయలు, డబల్ బెడ్ రూమ్ ఇళ్ల దగ్గర బోర్ మరియు మోటార్ కొరకు లక్ష యాభై వేల రూపాయల విలువ గల ప్రొసీడింగ్ పత్రాలను పంపిణీ చేసిన ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్రావు కోరుట్ల నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, జెడ్పిటిసి సంధి రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, టిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం




**కోరుట్ల సెప్టెంబర్ 05 (ప్రజామంటలు):**
లయన్స్ క్లబ్ ఆఫ్ కోరట్ల మరియు లయన్స్ క్లబ్ ఆఫ్ కోరుట్ల కోటి నవ దుర్గ అధ్వర్యంలో ఈ రోజు మన జిల్లా గవర్నర్ లయన్ హనుమాండ్ల రాజిరెడ్డి మరియు రీజియన్ అడ్వైసర్ అనంతుల శివ ప్రసాద్ (మాజీ గవర్నర్) ల జన్మదినం పురస్కరించుకొని అన్నదాన కార్యక్రమం మన క్లబ్ సభ్యులు లయన్ ఏలిమిల్ల ఉషాకిరణ్ డిస్ట్రిక్ట్ కోర్ టీమ్ (హంగర్ రిలీఫ్) సహకారంతో ఎసికొని గుట్ట హనుమాన్ దేవాలయం వద్ద పేదలకు అన్న దాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో సుమారు 200 మందికి అన్నదానం చేసి భోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో రెండు క్లబ్బుల అధ్యక్ష, కోశాధికారులు వనపర్తి చంద్ర మోహన్ – రమ్య, కొండబత్తిని అనంత కృష్ణ ప్రసాద్ – రాధిక మరియు వార్డు కౌన్సిలర్ పుప్పాల ఉమాదేవి ప్రభాకర్ మరియు సీనియర్ క్లబ్ నాయకులు ఆడెపు మదు, మంచాల జగన్, గుంటుక సురేష్, పోతని ప్రవీణ్ కుమార్, అలిశెట్టి భూమారెడ్డి, అల్లాడి ప్రవీణ్ కుమార్, పోల రఘు నందన్, నల్ల గంగాధర్, ఇల్లెందుల వెంకట రాములు, స్థానిక ఆర్ఎంపి పంచిరి శ్రీనివాస్ వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్, ఈవీఎం (గోడౌన్) ల తనిఖీ




**జనగామ సెప్టెంబర్ 05 (ప్రజామంటలు):**
జనగామ జిల్లా కలెక్టర్ సిహెచ్ శివలింగయ్య, అదనపు కలెక్టర్ స్థానిక (సంస్థలు) సుహాసిని తో కలిసి కలెక్టరేట్ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్, ఈవీఎం (గోడౌన్) ను మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన గోడౌన్ పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలు, ఫైర్ సేఫ్టీ, పోలీస్ సిబ్బంది హాజరు రిజిస్టర్, ఎన్నికల నిబంధనల ప్రకారం అన్ని తనిఖీ చేసారు, ప్రతి నెల వారి సాధారణ తనిఖీల్లో భాగంగా తనిఖీ నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఈ తనిఖీల్లో ఆయన వెంట ఎన్నికల విభాగం తాహసిల్దార్ ఎతేషాం అలీ, తదితరులు ఉన్నారు.

## ఉపాధ్యాయులను సన్మానించిన మాజీ జెడ్పిటిసి



**ఇబ్రహీంపట్నం సెప్టెంబర్ 05 (ప్రజామంటలు):**
ఇబ్రహీంపట్నం బిజెపి నాయకురాలు ఎక్స్ జెడ్పిటిసి జంగిలి సునీత వెంకట్ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం జిల్లా పరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయులకు శాలువాలతో సన్మానం చేయడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో మండల బిజెపి బీజేవైఎం అధ్యక్షులు బట్టు జకరయ్య, బొడ నవీన్ రెడ్డి, మండల ఉపాధ్యక్షులు వెంకటేష్ యాదవ్, జిల్లా కార్య వర్గ సభ్యులు తీగల శ్రీధర్ రెడ్డి, మండల కార్యదర్శి దేవన్న, శక్తికేంద్ర ఇంచార్జ్ లు గుంటి ప్రవీణ్. ముద్ద నరేష్ పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఎల్ఓసి అందజేసిన ఎమ్మెల్యే



**ఇబ్రహీంపట్నం సెప్టెంబర్ 05 (ప్రజామంటలు):** మండలం లోని వర్ష కొండ గ్రామానికి చెందిన మద్దనపల్లి మణికంఠ వయసు (06) గత మూడు సంవత్సరాల నుండి కాలి నొప్పితో బాధపడుతున్నాడు. ఆపరేషన్ నిమిత్తం నిమ్స్ హైదరాబాద్ హాస్పిటల్లో వైద్యులు పరీక్షించి ఆపరేషన్ అవసరము అని చెప్పారు. సుమారు 70 వేల రూపాయలు ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారు. ఈ విషయం కోరుట్ల నియోజకవర్గం ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు దృష్టికి తీసుకువెళ్లగా స్పందించి ఎమ్మెల్యే ఆఫీసులో ఎల్ఓసి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఎంపిటీసీ పోరం మండల అధ్యక్షుడు ఫోనుకంటి చిన్న వెంకటి, ఆరేపల్లి అశోక్. బిఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## నక్కలపేట ఎస్ఎస్ మోడల్ స్కూల్లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు



**ధర్మపురి సెప్టెంబర్ 05 (ప్రజామంటలు):** నక్కల పేట గ్రామంలోని ఎస్ ఎస్ మోడల్ స్కూల్ లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత అధ్యాపకురాలు, న్యూట్రిషన్ సలహాదారు శ్రీదారా కాంతా కుమారి ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు పోషకులకు ఉపాధ్యాయ బృందానికి ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. కాంతా కుమారి మాట్లాడుతూ.... పిల్లలు ఉపాధ్యాయుల పట్ల గౌరవ భావముతో మెలుగుతూ, ఆరోగ్యం పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. వారి చేతుల మీదుగా పాఠశాల అధ్యాపక బృందంకు శాలువాలు కప్పి సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గౌరవ కాంత కుమారి పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాస్ న్యూట్రిషన్ ఆర్గనైజర్ ఉపేందర్, వారి బృందం, విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## జెడ్పి హైస్కూల్లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు



**మహాదేవపూర్ సెప్టెంబర్ 05 (ప్రజామంటలు):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రంలో సర్వపల్లి రాధాకృష్ణన్ జన్మదినం పురస్కరించుకొని మహాదేవపూర్ జెడ్పి హైస్కూల్ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.... అజ్ఞానం అనే చీకట్లు తెంచి విజ్ఞానం అనే వెలుగులు పంచుతూ విద్యార్థులని ఉత్తమ పౌరులుగా ఉన్నత శిఖరాలకు ఎదిగేలా చేసేది ఉపాధ్యాయులే అని అన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కోట రాజబాపు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అక్బర్ ఖాన్, జడ్పిటిసి గుడాల అరుణ, ఎంపీటీసీ ఆకుతోట సుధాకర్, మైనార్టీ సెల్ అధ్యక్షులు అస్రార్ ఖురేషి, యూత్ కాంగ్రెస్ నాయకులు వెంకటరమణ, ఉస్మాన్, రాఘవేంద్ర, కడార్ల నాగరాజు, సోహెల్, ఉబేద్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంటింటికి తిరుగుతూ అమృత కలశంలో మట్టి సేకరణ



**ఇబ్రహీంపట్నం సెప్టెంబర్ 05 (ప్రజామంటలు):** మన ప్రియతమ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపు మేరకు బిజెపి జాతీయ అధ్యక్షులు జగత్ ప్రకాష్ నడ్డా ఆదేశాల మేరకు రాష్ట్ర శాఖ పిలుపు మేరకు కోరుట్ల నియోజకవర్గం ఇబ్రహీంపట్నం మండల కేంద్రము లో 'నా భూమి నా దేశం' కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరుగుతూ అమృత కలశంలో మట్టి సేకరించిన జె.యన్. సునీత దేవి, బిజెపి నాయకురాలు ఇబ్రహీంపట్నం మాజీ జడ్పిటిసి వారితో పాటు ఇబ్రహీంపట్నం మండలం అధ్యక్షులు బట్టు జక్రయ్య, నిజామాబాదు పార్లమెంట్ కో కన్వీనర్ గుంటుక సదాశివ్,మండల ప్రధాన కార్యదర్శి రనదీర్, బీజేపీ మండల ఉపాధ్యక్షులు వెంకటేష్, మండల కార్యదర్శి దేవన్న, జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీధర్ రెడ్డి, శక్తి కేంద్ర ఇన్చార్జ్ ముద్ద నరేష్, ప్రవీణ్, మరియు బీజేపీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

# యమునికి భరణీ నక్షత్ర పూజలు ఆయుష్య హెూమంలో పాల్గొన్న భక్తులు





**ధర్మపురి సెప్టెంబర్ 05 (ప్రజామంటలు):** క్షేత్ర దేవస్థాన అంతర్గతంగా ఉన్న యమ ధర్మరాజు మందిరంలో మంగళ వారం భరణీ నక్షత్ర సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. క్షేత్రంలోని యమ ధర్మరాజు మందిరం, విశేష ప్రాధాన్యతను సంతరించు కుంది. భారతావని లోనే అరుదుగా, అపురూపంగా, క్షేత్రంలో వెలసిన "యమ ధర్మరాజును దర్శిస్తే", "యమపురి" ఉండబోదని ప్రతీతి. ధర్మపురిలో దక్షిణ వాహినిగా ఉన్న గౌతమి యందు దక్షిణాభిముఖులై, స్నానాలు ఆచరిస్తే నరసింహుని దర్శిస్తే, నరక బాధలు ఉండవని భక్తుల ప్రగాఢ విశ్వాసం. యమ ధర్మరాజును దర్శించే భక్తుల సంఖ్య, నానాటికీ అధికమ వుతున్నది. ఇటీవల సంభవిస్తున్న అనూహ్య ప్రకృతి వైపరీత్యాల దృష్ట్యా, అకాల మృత్యు నివారణకై అధర్వణ వేదంలో పేర్కొనబడిన "ఆయుష్య సూక్తం" ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. అలాగే భరణి నక్షత్రం, చతుర్దశి తదితర ప్రత్యేక దినాల సందర్భంగా, అభిషేకం, ఆయుష్య సూక్తం, యమ సూక్త మంత్రం, పురుష సూక్తం, శ్రీసూక్తం, జ్వర హర స్తోత్ర పఠనాలు, రోగ నివారణ సూక్తాలు పూజలు, యమాష్ట కాది ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. మంగళవారం యమ ధర్మరాజుకు విశేష అర్చనలు, పూజాదులు నిర్వహించారు. పవిత్ర గోదావరి నది తీరాన వెలసి ఆస్తిక ప్రపంచానికి వరదాయిగా, భక్తి, ముక్తి ప్రదాయినిగా విరాజిల్లుతున్న హరిహర క్షేత్రమైన ధర్మపురిలోని, సమస్త భారతావని లోనే అపురూపంగా వెలసిన, శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానాంతర్గతంగా ఉన్న యమ ధర్మరాజు మందిరంలో భరణీ నక్షత్రంతో కూడిన సందర్భంగా మహా సంకల్ప యుక్త అభిషేకం, ఆయుష్య సూక్తం, యమసూక్త మంత్రం, పురుష సూక్తం, శ్రీసూక్త పఠనాది ప్రత్యేక పూజాది కాలను, అనంతరం జ్వరహర స్తోత్రము రోగ నివారణ సూక్తములచే పంచామృత అభిషేక యమాష్టక పఠనం, హారతి మంత్రపుష్ప, తీర్థ ప్రసాద వితరణాది ప్రత్యేక కార్యక్రమాలను దేవస్థానం పక్షాన నిర్వహించారు. దేవస్థానం ఏసీఈఓ సంకటాల శ్రీనివాస్ దర్శకత్వంలో, సూపరింటెండెంట్ కిరణ్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ పర్యవేక్షణలో, దేవస్థానం వేదపండితులు ముత్యాల శర్మ, రెనవేషన్ కమిటి సభ్యులు, అర్చకులు ప్రదీప్ కుమార్, నేరెళ్ల సంతోష్ కుమార్, బొజ్జా సంతోష్ కుమార్ , సంపత్ కుమార్, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు. అకాల మృత్యు బాధ రాహిత్యానికి, దీర్ఘ ఆయువుకై ప్రత్యేకంగా గోత్ర నామములతో ఆయుష్య సూక్త యుక్త పూజలను నిర్వహించారు.

## రత్నాపుర్ లో గ్రామీణ ఉపాధి హామీ పనులు సామాజిక తనిఖీ




**చొప్పదండి సెప్టెంబర్ 05 (ప్రజామంటలు):** మండలంలోని రుక్మాపూర్ గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 14వ విడత సామాజిక తనిఖీకి సంబంధించిన గ్రామ సభకి ముఖ్యఅతిథిగా గౌరవ ఎంపీపీ చిలుక రవీందర్ పాల్గొన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో కూడా ఉపాధి హామీకి సంబంధించినటువంటి పనులు చాలా బాగా జరిగాయని, ఉపాధి హామీ కూలీల యొక్క శ్రమ వల్ల గ్రామంలోని వివిధ మౌలిక వసతుల అభివృద్ధి పనులకు మెటీరియల్ కాంపోనెంట్ పనులు వస్తున్నాయని రవిందర్ తెలిపారు. రుక్మాపూర్ గ్రామంలో అన్ని పనులు కూడా చాలా బాగా ఉన్నాయని సామాజిక తనిఖీ బృందం వారు కూడా గుర్తించినట్లు ఎంపీపీ తెలిపారు. గ్రామస్తులకు ఎటువంటి సమస్యలు వచ్చిన అందుబాటులో ఉండి ఆ సమస్యలు తీర్చుతానని గ్రామస్తులకు తెలిపారు. గ్రామ సభలో స్థానిక సర్పంచ్ చిలుక లింగయ్య, ఉప సర్పంచ్ చిరంజీవి పంచాయతీ కార్యదర్శి మహితాబ్ గారు ఏపీవో రాజు, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

## రవీంద్రభారతిలో సన్మానం పొందిన తోట రాజు



**జమ్మికుంట సెప్టెంబర్ 05 (ప్రజామంటలు):** ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును రాష్ట్ర హెూంశాఖ మంత్రి మహమూద్ అలీ, విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, విద్యా సంచాలకులు శ్రీదేవసేన గార్లు రవీంద్రభారతిలో జమ్మికుంట మండలంలోని తనుగుల గ్రామానికి చెందిన ఉపాధ్యాయులు తోట రాజును ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తోట రాజు తన తోటి ఉపాధ్యాయులు మరియు సమాజ భాగస్వామ్యంతో పాఠశాలను అభివృద్ధి పరిచి, విద్యార్థుల సంఖ్యను పెంచిన విధానాన్ని మెచ్చుకున్నారు. ఈ సందర్భంగా తోట రాజు పాఠశాల అభివృద్ధికి తనకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ అవార్డును తమ తల్లిదండ్రులకు అంకితం ఇస్తున్నట్లు తెలిపారు. తమ గ్రామానికి చెందిన తోట రాజు అవార్డును పొందిన సందర్భంగా గ్రామస్థులు వారిని అభినందించారు.

## సమీక్ష సమావేశాన్ని నిర్వహించిన ఆలయ చైర్మన్ లింగంపల్లి శ్రీనివాసరావు



**మహాదేవపూర్ సెప్టెంబర్ 05 (ప్రజామంటలు):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రంలోని కాళేశ్వరం ముక్తేశ్వర స్వామి దేవస్థానం నూతన ధ్వజస్తంభ ప్రతిష్టాపన ఈనెల 13వ తేదీన ఉన్నందున చేపట్టవలసిన కార్యక్రమాల గురించి కాళేశ్వర ముక్తేశ్వర దేవస్థానం చైర్మన్ లింగంపల్లి శ్రీనివాసరావు ఆలయ అధికారులు సిబ్బంది అర్చకులు పాలకమండలి సభ్యులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ మహేష్ ధర్మకర్తలు కలికోట దేవేందర్, అడుప సమ్మయ్య, కామెడీ రామి రెడ్డి, అర్చకులు నాగేష్ శర్మ, కృష్ణమూర్తి శర్మ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



**కోరుట్ల సెప్టెంబర్ 05 (ప్రజామంటలు):** కోరుట్ల పురపాలక సంఘ కమీషనర్ ప్రజలకు తగు సూచనలు చేస్తూ వర్షాల తీవ్రత ఎక్కువగా ఉన్నందున డెంగ్యూ మరియు చికెన్ గున్యా, మలేరియా వంటి దోమల ద్వారా వ్యాప్తి చెందే వ్యాధులతో పాటు కలుషితమైన నీరు మరియు ఆహారం ద్వారా వ్యాపించే టైఫాయిడ్, కలరా వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు కనీస జాగ్రత్తలు పాటించాలి. దోమలు వృద్ధి చెందకుండా తమ ఇంటి పరిసర ప్రాంతాలలో నీరు నిలువ ఉండకుండా చూసుకోవడంతో పాటు రిఫ్రిజిరేటర్లు ,కూలర్లు, పాత డ్రమ్ములు, టైర్లు, కొబ్బరి చిప్పలు వంటి వాటిలో నీరు నిలువ ఉండకుండా చూసి దోమలు వృద్ధి చెందకుండా జాగ్రత్త వహించాలి మరియు దోమతెరల వంటి వాటిని వాడాలి. క్లోరినేషన్ జరిపిన నీటిని కాచి వడబోసిన తర్వాత తాగాలి. ప్రతి ఒక్కరూ తమ ఇంటి పైనున్న ఓవర్ హెడ్ ట్యాంకులను తరచుగా శుభ్రపరుస్తూ వాటి మూతలు పూర్తిగా మూసి ఉండేలా చూసుకోవాలి. చేతులు తరచుగా సబ్బుతో శుభ్రంగా కడగాలి. ప్రజలు తీసుకునే ఆహారంపై కీటకాలు వాలకుండా చూసుకొని పరిశుభ్రమైన తాజాగా వండిన వేడి ఆహారం తీసుకోవాలి. వర్షం పడే సమయంలో చెరువులలో, కుంటలలో, వాగు ప్రాంతంలో నీటి ఉధృతి ఎక్కువగా ఉన్న సమయంలో జాలరులు ( చేపలు పట్టేవారు )చెరువులలో,కుంటలలో మొదలైన వాటిలో చేపలు పట్టరాదు మరియు ఎట్టి పరిస్థితులలో ఎవరు నీటిలోనికి దిగరాదని పలు సూచనలు చేశారు.

## భావి భారత పౌరులను తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే



**జనగామ సెప్టెంబర్ 05 (ప్రజామంటలు):** జనగామ జిల్లా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ధర్మక%శీ%చ జనగామ లో మంగళవారం జాతీయ సేవా పథకం ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ వస్కుల శ్రీనివాస్, మరిపెల్ల రవిప్రసాద్ అధ్యర్యంలో జరిగిన టీచర్స్ డే కార్యక్రమం లో కళాశాల ప్రిన్సిపాల్ మహమ్మద్ ఆఫ్జల్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటంకు వందనాలు చేసి పూలు సమర్పించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ క్రమశిక్షణతో చదివితే జీవితంలో ఏదైనా సాధించవచ్చని, అజ్ఞానము అనే చీకటిని తొలగిస్తూ విజ్ఞానము అనే వెలుగులు ప్రసాదిస్తూ, భవిష్యత్తు తరాలకు బంగారు బాటలు వేస్తూ భావి భారత పౌరులను తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులందరికీ గురు పూజ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకులు శతి నందిని పటేల్, రామస్వామి, రంగన్న, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొని సంతోషం వ్యక్తం చేశారు.

## ఎం.ఆర్.పి.ఎస్. జనగామ జిల్లా సంయుక్త కార్యదర్శిగా అంతగల్ల మధు మాదిగ

**జనగామ సెప్టెంబర్ 05 (ప్రజామంటలు):** జనగామ జిల్లా లింగాలఘనపూర్ మండలం కుందారం గ్రామవాసిఅంతగల్ల మధు మాదిగ ఎం.ఆర్.పి.ఎస్ జనగామ జిల్లా సంయుక్త కార్యదర్శిగా



నియమితులయ్యారు. ఈ సందర్భంగా అంతగల్ల మధు మాట్లాడుతూ ఎం.ఆర్.పి.ఎస్ ఉద్యమ అంతిమ లక్ష్యం ఎస్.సి వర్గీకరణ జరిగేంతవరకు తన వంతు కృషి చేస్తానని, జాతి అభివృద్ధి లక్ష్యంగా ముందుకు వెళతానని అన్నారు. ఎం.ఆర్.పి.ఎస్ వ్యవస్థాపకులు మంద కృష్ణ మాదిగ, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు గోవిందు నరేష్ మాదిగ కు జనగామ జిల్లా ఎం.ఆర్.పి.ఎస్,ఎం.ఎస్.పి. జిల్లా ఇంచార్జ్ మడిపెల్లి శ్యామ్ మాదిగ, ఎం.ఆర్.పి.ఎస్ జాతీయ ఉపాధ్యక్షులు విజయ్ మాదిగకు కృతజ్ఞతలు తెలిపారు. నూతనంగా ఎం.ఆర్.పి.ఎస్. జనగామ జిల్లా అధ్యక్షులు పైసా రాజశేఖర్ మాదిగ కు తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల్ల ఉపేందర్ మాదిగ కి, సందెన రవీందర్ మాదిగ కి, గద్దం ఆంజనేయులు కు కృతజ్ఞతలు తెలిపారు.

## వెంకిర్యాల ప్రాథమిక పాఠశాలలో గురుపూజోత్సవం




**జనగామ సెప్టెంబర్ 05 (ప్రజామంటలు):** జనగామ మండలం ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు దూడల రమేష్ అధ్యక్షతన ఘనంగా గురుపూజోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన గ్రామ సర్పంచ్ కీర్తి లక్ష్మీ నర్సయ్య, విద్యాకమిటి చైర్మన్ తాళ్లపల్లి అశోక్ గౌడ్ మాట్లాడుతూ.... తల్లిదండ్రులు జన్మనిస్తే గురువులు భవిష్యత్తు ఇస్తారని, సమాజంలో కనిపించే ప్రత్యక్ష దైవాలు గురువులేనని, విద్యార్థులను ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల కృషి ఎనలేనిదని అన్నారు. తన శిష్యుల ఎదుగుదలనే గురుదక్షిణగా భావించే ఒకే వ్యక్తి ఉపాధ్యాయుడని, తలరాతలు రాసేది దేవుడైతే బడి రాతలు రాయించి మన భవిష్యత్తు బాటలు వేయించడానికి మాత్రం మన గురువులే, డాక్టర్ లేకపోతే వైద్యం లేదు, పోలీసు లేకపోతే భద్రత లేదు, ఇంజనీర్ లేకపోతే టెక్నాలజీ లేదు, టీచర్ లేకపోతే పైవారు ఎవరూ లేరు అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యా రాణి, స్రవంతి, జగదాంబ, స్వరూప, ఆయాలు ఏలేంద్ర, లక్ష్మి యువజన నాయకుడు నాంపల్లి రఘు తదితరులు పాల్గొన్నారు.



రిషి కాన్వెంట్ హై స్కూల్ లో సోషల్ స్టడీస్ ఉపాధ్యాయురాలు ఎం. గీతారాణి గారు కరీంనగర్ జిల్లా నుండి ఉత్తమ ఉపాధ్యాయురాలుగా ఎన్నికై మంత్రి గంగుల కమలాకర్, ఎంఎల్ఏ రవిశంకర్, ఎంఎల్ఏ రసమయి బాలకిషన్, కలెక్టర్ గోపి, డిఈఓ జనార్దన్ రావు, చేతుల మీదగా అవార్డు అందుకున్న శుభ సందర్భంలో పాఠశాల యాజమాన్యం అభినందనలు తెలియజేయడమైనది

# లోపాలపై ఆత్మపరిశీలన అవసరం...!

ఒకప్పుడు సిఎం కెసిఆర్ ఉపన్యాసాలు ఉర్రూతలూగించేవి. తెలంగాన ఉద్యమంలో ప్రజల్లో కదలిక రావడానికి అదే ఉపయోగపడింది. అధికారం రాకముందు వరకు కెసిఆర్ అంటే ప్రజల్లో ఒక ఆరాధనా భావం ఉండేది. తెలంగాణ దీనజనోద్ధారకుడని అంతా భ్రమించారు. అధికారం వచ్చాక కూడా అలాంటి నమ్మకంతోనే ఉంటూ వచ్చారు. కానీ క్రమంగా భ్రమలు తొలగిపోయాయి. ఆయన కూడా ఫక్తు రాజకీయ వేత్త అని తెలుసుకోవడానికి ఎక్కువ కాలం పట్టలేదు. అందరు రాజకీయవేత్తల్లానే కెసిఆర్ వైఖరి కూడా ఉంటోంది. ఇంకొంచెం ఎక్కువగా ..అంటే ప్రజలకు అందనంతగా దూరం తన పరిధిని పెంచుకున్నారు. ప్రజలకు తనకు మధ్య వారధి కట్టుకున్నారు. ప్రజలతో నేరుగా సంబంధాలు లేకుండా చేసుకున్నారు. క్షేత్రస్థాయిలో ఏం జరుగుతుందో తెలుసుకోవడం, వాటికి పరిష్కారం చూపడం అవసరం. కానీ అలా జరగడం లేదు. ఇకపోతే ఉద్యమంలో తకు చేదోడువాదోడుగా ఉన్న నేతలను పక్కన పెట్టారు. కోదండరామ్ లాంటి వారిని దూరం చేశారు. చివరకు ఈటెల రాజేందర్ లాంటివారిని కూడా పొగబెట్టి పంపించేశారు. అంతకుముందు విజయశాంతిని, నరేంద్రను పంపించేశారు. తెలంగాణ ఉద్యమంతో సంబంధం లేని వారంతా మంత్రులుగా వెలగబెడుతున్నారు. ఇవన్నీ కూడా చిత్రగుప్తుడి చిట్టాల్లా ప్రజల మనసుల్లో బలంగా నాటుకున్నవే. వాటిని తొలగించడం అంత ఈజీ కాదు. ఇకపోతే తెలంగాణ ఉద్యమ సమయంలో అసెంబ్లీలో మాట్లాడినా, బహిరంగ సభల్లో మాట్లాడినా కెసిఆర్ ఉపన్యాసాలకు జనం విపరీతమైన భావోద్వేగాలకు గురయ్యేవారు. రాజీనామాలు చేసి ఉప ఎన్నికలకు వెళితే ఉద్యమనేతగా ఉన్నప్పుడు ప్రజలు పెద్ద ఎత్తున ఆయన సభలకు రావడం కోసం పరుగులు పెట్టేవారు. ఏ నేత అయినా వచ్చి మాట్లాడితే..కెసిఆర్ ముందు దిగదుడుపే అన్నట్లుండేవారు. కెసిఆర్ సభలో కరతాళ ధ్వనుల మధ్య రెచ్చగొట్టే ఉపన్యాసాలు చేసేవారు. ఆయన మాట్లాడిన తర్వాత జనం ఆ ప్రసంగాలను నెమరు వేసుకునే వారు. గత ఎన్నికల ముందు వరకు ఆయన ఛరిష్మా చెక్కు చెదరలేదు. బహుశా ఇప్పుడు ఎందుకో కెసిఆర్ ఉపన్యాసాలు రొటీన్‌గా, సాదాసీదాగా అనిపిస్తున్నాయి. ప్రత్యర్థులపై ఆయన ఎంత తీవ్రమైన ఆరోపణలు చేసినా వాటిని జనం అంతగా పట్టించుకోవడం లేదు. డైలాగుల్లో పంచ్ ఉండడం లేదు. ఆయన ఇచ్చే హామీలు, చేసే ప్రకటనలు చూసి జనం నవ్వుకుంటున్నారు. రాజకీయ నాయకుల మాటల్లో, చేతల్లో నిజాయితీ లేకపోతే వారి విలువ ప్రశ్నార్థకం అవుతుందనడానికి కెసిఆర్ అనుసరిస్తున్న రాజకీయ విధానాలే కారణంగా చూడాలి. ఆయన ఒకే ఒక్క గీత గీసుకుని ప్రజలకు దూరంగా ఉండడం, రాజదర్బార్ నుంచి బయటకు రాకవపోవడం, జనంతో మమేకం కాలేక పోవడం వంటివి అలవర్చుకున్నారు. ఇచ్చిన హామీలు కోకొల్లలుగా ఉండడం వంటివన్నీ మైనస్ పాయింట్లుగా చెప్పుకోవాలి. సచివాలయానికి,ప్రగతిభవన్‌కు జర్నలిస్టులను దూరం పెట్టడం, రాజకీయనేతలతో మమేకం కాకపోవడం, సొంత నేతలను కూడా దూరంగా పెట్టడం లాంటి చర్యలను అవలంబించడం వంటివి రాజకీయాల్లో చెల్లవు. ప్రజాస్వామ్యంలో ప్రజలతో ఎంతగా సఖ్యతగా ఉంటే అంతగా జనం ఆదరిస్తారు. అధికారం ఎప్పుడూ మన చెంతనే ఉంటుందని భ్రమించడం మంచిది కాదు. ఇందిరాగాంధీ, ఎన్టీఆర్ లాంటి వారు కూడా మట్టి కరిచారు. ఒకప్పుడు ఆకాశమంత ఎత్తుకు ఎదిగిన నేత కూడా మాట్లాడిందే మాట్లాడుతూ, ఎదుటివారిని అదేపనిగా తిప్పి కొడుతూ, ఇతరుల తప్పులను విమర్శిస్తూ తాను కూడా అదే తప్పులు చేస్తున్నప్పుడు ప్రజలు ఆలోచిస్తారు. వారు మనకన్నా రెండాకులు ఎక్కువే చదివారన్న ధ్యాసలో రాజకీయ నాయకులు ఉండాలి. ఎంతోకాలం బురిడీ కొట్టించలేమని అనుకోవాలి. అలాంటి వారు ప్రజల దృష్టిలో చులకలన కాక తప్పదు. కాళేశ్వరం, నిరతంర విద్యుత్, మిషన్ భగీరథ, పెన్షన్లు వంటివి ఎంతగా అమలు చేసినా ..అవన్నీ కూడా కెసిఆర్ తనకుతానుగా తన గొప్పగా చెప్పుకోవడం సరికాదు. తెలంగాణ ప్రజల జీవితాలను బాగు చేస్తానని ఉద్యమించి వచ్చినప్పుడు గతం కన్నా భిన్నంగా చేయడం కర్తవ్యం. కెసిర్‌ను అవతారా పురుషుడగా ఆయన పరివారం కీర్తించడం కూడా జనాలకు రుచించండం లేదు. కేసీఆర్ ప్రభుత్వాన్ని అత్యంత అవినీతి ప్రభుత్వంగా విపక్షాలు అభివర్ణిస్తున్నాయి. మియాపూర్ భూముల కేసు, నయాం డైరీ, డ్రగ్స్ కేసు, పేపర్ల లీకేజీ కేసు, ఎమ్మెల్యేల కొనుగోలు కేసుల వంటివన్నీ కల్పిత కథలుగా మార్చేశారు. ఇవన్నీ మనం ఎంతగా మర్చిపోయినా జనం మదిలోంచి తుడిపేయలేం. మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్, రంగనాయక సాగర్ నిర్వాసితులను ఎంతగా హింసించిందీ మరచిపోరు. ఇలా ఒక్కో విషయంలో కెసిఆర్ ఆత్మపరిశీలన చేసుకోవాలి. తెలంగాణ కోసం పోరాడిన జనాలకు ఇచ్చిన బాసలను గుర్తు చేసుకోవాలి. ప్రజలతో ఉంటే వచ్చే ఆనందం వేరు. మాటలతో వారిని ఆనందపుచ్చినా...అది తాత్కాలికమే అని గుర్తించాలి. అవినీతి, అక్రమ సంపాదన ఎల్లకాలం నిలవదు. ఆ సంపాదన నిరంతరం కాపాడదు. విచిత్రమేమంటే కేసిఆర్ చేస్తున్న విమర్శలు పార్టీ కార్యకర్తల్లోనే ఆత్మవిశ్వాసం కలిగించడం లేదు. కేంద్రంపై కావచ్చు, కాంగ్రెస్, బీజేపీలపైనా కావచ్చు..విమర్శలు పెద్దగా రక్తి కట్టడం లేదని గుర్తించాలి. గతంలో కనపడినంత ఊపు క్రమక్రమంగా తగ్గిపోవడానికి ప్రధాన కారణం తెలుసుకోవాలి. ప్రజలతో

సయోధ్యను ఏర్పర్చేందుకు అవసరమైనంత వేగంగా చర్యలు తీసుకోవాలి. కోల్పోయిన ఊపును సంపాదించడం సాధ్యమవుతుందా అన్నది కూడా ఆలోచించాలి. అందుకు ఏం చేస్తే మంచిదన్న వివేచన చేయాలి. అయితే ఇక్కడ కెసిఆర్‌ను మించి కాంగ్రెస్, బిజెపి మంచి చేస్తుందని చెప్పడం లేదు. ఎందుకంటే అవన్నీ ఒకే తాను ముక్కలు.



## సాహితీ ప్రేమికులకు ప్రత్యేకం

"ప్రజా మంటలు" తెలంగాణ జాతీయ దినపత్రికలో ప్రతి రోజు ఒక కథను ప్రచురిస్తున్నాం. ముఖ్యంగా బాలల కథలకే ప్రాధాన్యత ఇస్తున్నవిషయాన్ని గమనించి ఉంటారు. ఇందులో ప్రచురించిన కథలలో, ఎంపిక చేసిన వాటిని "యూ ట్యూబ్ " లో కూడా పెట్టగలము. కథకులు ఈ విషయాన్ని గమనించి, సంభాషణలు చిన్నవిగా, వర్ణన తక్కువగా, సూటిగా విషయాన్ని చెప్పే కథలను పంపండి. రచయితలు తమ కథలను mantalukathalu@gmail.com కు పంపవచ్చు....

-ఎడిటర్

## నక్కలో మార్పు...

అనగనగా ఓ చిట్టడివి. అడవిలో ఒక చెట్టు పైన కాకి, బుజ్జి ఉడుత, చెట్టు మొదల్లో చీమల గుంపు వీళ్లంతా మంచి స్నేహితులు. కాకి ఊరంతా తిరిగి ఆహారం తెచ్చి ఉడుతకి, చెట్టు కింద ఉన్న చీమలకి ఇస్తుంది. చిట్టి ఉడుత చెట్టు పైన పండ్లు తింటూ, చీమలకి ఆహారం కిందకి వేస్తుంది. ఇదంతా జిత్తుల మారి నక్క రోజు దూరం నుండి కనిపెడుతుంది. ఒకరోజు నక్కకి ఆహారం ఎక్కడా దొరకలేదు. కాకి ఉడుత నివసించుచున్న చెట్టు దగ్గరికి వచ్చింది ఆ నక్క. అదే సమయంలో కాకి పెద్ద మాంసం ముక్క నోట కరుచుకుని తెచ్చింది. నక్క తెలివిగా కాకి బావ! నీ అందం, నీ నున్నని శరీరం, నీ చాకచక్యం నాకు బాగా నచ్చుతుంది అని పొగడ్తలతో ముంచెత్తింది. అలాగే నీ గొంతుక మాధుర్యం వినాలని నేను వచ్చాను అంది. అప్పుడు కాకి తెలివిగా తన నోటిలో ఉన్న మాంసం ముక్కను తన కాళ్ళ కింద పట్టుకుని కా, కా, అని పాడింది. నక్క ఆశ్చర్యపోయింది, అబ్బా దీనికి ఎంత తెలివితేటలు, అదే సమయంలో బుజ్జి ఉడుత చెంగుచెంగునా గెంతుకుంటూ వచ్చి పట్టు తప్పి సరిగ్గా నక్క మీద పడింది. ఉలిక్కిపడి లేచిన నక్క, మెరుపు వేగంతో ఉడుతను పట్టుకుంది. ఎంత ప్రయత్నించినా అది తప్పించుకోలేకపోయింది. అదే సమయంలో చీమల గుంపు ఒక్కసారిగా లేచి నక్క శరీరంపై దాడి చేసి ఉడుతని రక్షించాయి. జిత్తుల మారి నక్కకి దిమ్మతిరిగింది. ఆ నక్క ఒళ్లంతా దులుపుకుని, నన్ను క్షమించండి.. మీరంతా ఇంత స్నేహంగా ఎలా కలసి మెలసి ఉంటున్నారు అని అడిగింది. మిమ్మల్ని చూసి నేను అసూయ, ఈర్ష్య పడ్డాను. మీ లాగా నేను ఇతర జంతువులతో కలసి మెలసి ఉండడం ఎలాగో చెప్పండి.

ఓ..... అదా... ఏం లేదు నక్క బావ!......

ఇతరులతో నిన్ను నీవు అస్సలు పోల్చుకోకు, వాళ్లను చూసి ఈర్ష్య పడకు. నువ్వేంటో, నీ పని ఏంటో... అంతవరకే చూసుకో, ఉన్న నాడు పొంగి పోకు, లేని నాడు కుంగిపోకు. ఉన్నంతలో తృప్తి పడాలి. ముఖ్యంగా నీ జిత్తుల మారి బుద్ధి అసలు ఉండకూడదు.



అని చెప్పాయి. భగవంతుని దృష్టిలో చీమ చాలా చిన్న ప్రాణి. అయినా దానికి ఏ మాత్రం స్వార్థం లేదు. ఆహారం లభించి నప్పుడు చీమలన్నీ కలసి తింటూ ఉంటాయి,

వాటిని చూసి మేమంతా మంచి స్నేహితులుగా ఉంటున్నాం అని చెప్పాయి కాకి ఉడుత. అప్పటినుండి నక్క కూడా ఇతరులకు చెడు చేయాలన్న ఆలోచనలను తన మనసులోకి రానివ్వలేదు. ఇతర జంతువుల మీద మృగరాజుకు చాడీలు చెప్పడం మానుకుంది. తనకు దొరికిన ఆహారంతోనే తృప్తిగా జీవించడం ప్రారంభించింది., కొద్దిరోజుల్లోనే అడవిలో జంతువులన్నీ నక్కకి మంచి స్నేహితులు గా అయ్యాయి. నక్క కూడా ఉల్లాసంగా, ఉత్సాహంగా తయారయింది. అప్పుడు నక్క లో మార్పును చూసి బుజ్జి ఉడుత, కాకి, చీమలు ఆనందించాయి. మంచి స్నేహితులుగా కలసి మెలసి మెలుగుచున్నాయి..

**బల్ల కృష్ణ వేణి పలాస**

---

## ఎత్తుకు పై ఎత్తు - ఆపై చిత్తు...

పోలయ్య అనేరైతుఏడాదంతా చెమటోడ్చి కష్టపడి పండిన ధాన్యాన్నంతా పడమటిగదిలో నిలవ వుంచేవాడు గిట్టుబాటు ధర కోసం ఎదురు చూసేవాడు. తీరా ధరవచ్చాక ధాన్యం కొలిస్తే తేడా ఎక్కువగా వుండేది కారణం ఇంట్లోవున్న ఎలుకలబెడదే.! వీటిని ఎలావదిలించుకోవాలా?అని ఆలోచించి మిత్రుడింట్లో వున్న పిల్లినొకదాని నిచ్చాడు.

పిల్లి వచ్చిన కొత్తలో తెలియక అమాయ.

ఏకంగా వెలుపలికి వచ్చి ఇంట్లో అటు ఇటుపరుగెత్తుతూ ఎలుకలు కొన్నిపిల్లికి ఆహారం అయిపోయాయి.అయితే క్రమంగావాటికి బుద్ధి వచ్చింది. మిగిలిన ఎలుకలు ఒక చోట కలుసుకుని ఇకమీదట జాగ్రత్తగా వుండాలని ఒక ఎత్తువేశాయి..బయటకు రావడం తగ్గించేసాయి.పిల్లి అరుపు,నడకను జాగ్రత్తగాగమనిస్తూ పిల్లికంటపడకుండా తప్పించుకోసాగాయి.

నాలుగయిదురోజులు గడిచేసరికి ఎలుకలు జాగ్రత్త పడి తననుంచి తప్పించుకున్నట్టు పిల్లికి అర్థమయింది.ఆహారం విషయంలో లోటు లేదు. రైతు కమ్మనిపాలు కావాల్సినన్ని గిన్నెలో పోసి వుంచుతాడు.అవి తాగి కడుపునింపుకుంటున్నది.కానీ దానికి వేటాడి ఎలుకను తినేదాంట్లోవున్న తృప్తి గిన్నె లో పోసిన పాలు తాగుతుంటే కలగడంలేదు. అందుకని పై ఎత్తు ఒకటి ఆలోచించింది.అరవకుండా వుండడం,వీలున్నంతలో తను అటు ఇటు తిరగకుండా ధాన్యంనిలవవుండే కూనలచాటున వుండిపోవడం.అందువల్ల తన జాడ తెలియక ఎలుకలు ధైర్యంగా బయటకొస్తాయి.అప్పుడు వాటిని గుటుక్కు మనిపించవచ్చు.

వెంటనే ఆ ఆలోచనను అమలులో పెట్టింది.పిల్లి శబ్ధం వినపడకపోయినా ,జాడతెలియక పోయినా గబుక్కున ఎలుకలు ముందుకు రాలేదు.నిదానం ప్రధానం అని ఎలుకలు అనుకున్నాయి. వేచి చూసే ధోరణిని ఆచరించాయి.పిల్లి తన పైఎత్తుపారనందుకు బాధపడింది.అయినా పట్టు వీడలేదు.పిల్లిని గమనిస్తూన్నరైతుకు కొద్దిరోజులకు సందేహం ముంచుకొచ్చింది."ఇది ముసలిదయివుంటుంది. లేదా ఏదైనా జబ్బు బారిన పడివుంటుంది..లేకపోతే అలానీరసంగా వుండదు.

పాలు తాగి హాయిగా నిద్రపోతున్నది. దీనివల్ల ఉపయోగంలేదు. దీన్ని ఎంత త్వరగా వదిలించుకుంటే అంత మంచిది"అనుకుని తీసుకెళ్ళి అడవిలో వదిలేశాడు. అప్పుడు పిల్లికి తన తప్పు తెలిసొచ్చింది.''పొరపాటు చేశాను .ఎలుకలు దొరికినా దొరక్కపోయినా వేట మానివుండకూడదు.ఎలుకల్ని వేటాడతాననే కదా రైతు నన్నుతెచ్చిపాలు పోసి పెంచుతున్నాడు.తానా విషయం మరిచింది.

జీవితంలో ఎత్తులు,పైఎత్తులు సహజమే!వాటిల్లో పడిపోయి తన ధర్మాన్ని తాను మరిచింది.తను చేయాల్సినపని చేయకపోవడం వల్ల చేటు వచ్చింది..ఎత్తుకు పై ఎత్తు వేయబోయి ఎలుకలచేతిలో చిత్తయిపోవలిసి వచ్చింది" అని పశ్చాత్తాపడుతూ దూరంగా కనిపిస్తున్న గ్రామం వైపుకు పరిగెత్తింది.

**డా.గంగిశెట్టి శివకుమార్.**

## లక్షలాది మందికి దృష్టిని ప్రసాదించిన శివారెడ్డి

### సెప్టెంబర్ 6... పద్మశ్రీ పెరుగు శివారెడ్డి వర్ధంతి



రెండు లక్షల యాభై వేలకు పైగా కంటి శుక్లాల ఆపరేషనులు చేసి అత్యధిక కంటి శుక్లాల ఆపరేషనులు చేసిన డాక్టరుగా గిన్నీస్ ప్రపంచ రికార్డులకు ఎక్కిన అసమాన కంటి శస్త్ర చికిత్స నిపుణుడు శివారెడ్డి. ఆంధ్రప్రదేశ్ గవర్నర్ సలహా దారుగా, భారత రాష్ట్రపతి లి గౌరవ నేత్ర చికిత్సకులుగా పని చేసిన డాక్టర్ పెరుగు శివారెడ్డి (సెప్టెంబర్ 12, 1920 – సెప్టెంబర్ 6, 2005) ఆంధ్రప్రదేశ్ లోని ఒక ప్రఖ్యాత నేత్రవైద్య నిపుణుడు. పెరుగు శివారెడ్డి కర్నూలు జిల్లా దిన్నెదేవర పాడు గ్రామంలో 1920, సెప్టెంబరు 12 న జన్మించారు. ఈయన తండ్రి పి.హెచ్.రెడ్డి. (పెరుగు హుస్సేన్ రెడ్డి – దర్గా దగ్గర జన్మించటంతో ఈ పేరు పెట్టడం జరిగినది). ఆయన 1946లో మద్రాసు విశ్వ విద్యాలయం నుండి ఎం.బి.బి.యస్. (డాక్టరు) పట్టా పొంది 1952లో నేత్ర వైద్యంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం నుండి ఎం.యస్. పట్టాను స్వీకరించారు.

ప్రారంభ ఉద్యోగం మద్రాసు మెడికల్ సర్వీసెస్ లో అసిస్టెంట్ సర్జన్ (1949–53) ఆంధ్ర మెడికల్ కాలేజి, కె.జి (కింగ్ జార్జి) హాస్పిటల్, విశాఖ పట్టణంలో ఆఫ్తాల్మోలజీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా, అసిస్టెంట్ సర్జన్ గా (1953–56) పనిచేశారు. ఉస్మానియా మెడికల్ కాలేజీ, హైదరాబాద్ (1958 – 61) సరోజినీ ఐ హాస్పటల్ ఆహ్వానం మీద అక్కడ సూపరిండెంట్ గా, అఫ్తాల్మాలజీ ప్రొఫెసర్ గా పదవీ బాధ్యతలు నిర్వర్తించారు. 1961–75 కాలంలో రాష్ట్ర ప్రభుత్వ సర్వీసులో చేరారు. అప్తాల్మాలజీ డైరక్టరుగా (1978–81) పోస్టు గ్రాడ్యుయేషన్ స్టడీస్ కు ప్రొఫెసరుగా (1975–78) వ్యవహరించారు. ఆంధ్రప్రదేశ్ గవర్నర్ సలహా దారుగా, దేశ ప్రథమ పౌరుడి (రాష్ట్రపతి) కి గౌరవ నేత్ర చికిత్సకులుగా నియమితు లయ్యారు. ఉస్మానియా మెడికల్ కాలేజీ అఫ్తాల్మాలజీ విభాగానికి ఎమెరిటస్ ప్రొఫెసర్ గా, చైనా లోని సన్–యట్ సెన్ యూనివర్శిటీ ఆఫ్ మెడిసన్ సంస్థకు విజిటింగ్ ప్రొఫెసర్ గా రాణించారు. గుండె పోటుతో మరణించే వరకు ఆయన హైదరాబాదులోని సరోజినీదేవి కంటి ఆసుపత్రికి డైరెక్టరుగా ఉన్నారు. అనేక దేశాలు పర్యటించారు. అమెరికా అకాడమీ ఆఫ్ ఆప్తల్మోలజీ వారు కొంతకాలం తమతో ఉండేందుకు ఆహ్వానించి, అపూర్వ గౌరవ మర్యాదలు అందించారు. అనేక దేశాల్లోని సన్నిహిత మిత్రులు తమ దేశాలు వచ్చి, స్థిరపడాలని కోరి ఒత్తిడి చేసినా ఈయన యిష్టపడలేదు.

డాక్టర్ శివారెడ్డి ఆంధ్రప్రదేశ్ స్టేట్ అఫ్తాల్మోలాజికల్ అసోషియేషన్ అధ్యక్షులుగాబీ ఆల్ ఇండియా అఫ్తాల్మోజాలికల్ సొసైటీ అధ్యక్షులుగాబీ ఆసియా ఫసిఫిక్ అకాడమీ ఆఫ్ ఆఫ్తాలజీ ఉపాధ్యక్షులుగాబీ స్థాపక సభ్యులుగాబీ అమెరికన్ అకాడమీ ఆఫ్ అఫ్తాల్మాలజీ గౌరవ సభ్యులుగాబీ ఇండియన్ నేషనల్ ప్రోగ్రాం ఫర్ ప్రివెన్సన్ ఆఫ్ బ్లయిండ్‌నెస్ గౌరవ సభ్యులుగాబీ ఇంటర్నేషనల్ ఏజన్సీ ఫర్ ప్రివెన్షన్ ఆఫ్ బ్లైండ్‌నెస్ మొదలగు పదవులను నిర్వహించారు.

మద్రాసు యూనివర్శిటీలో గ్రాడ్యుయేషన్ (1946), ఆంధ్ర యూనివర్శిటీలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ (1952) పూర్తయిన తర్వాత కూడా మూడు దశాబ్దాల పాటు నేత్ర వైద్య చికిత్సను బోధించారు. 500 మందికి పైగా పోస్ట్ గ్రాడ్యుయేట్లకు శిక్షన అందించారు. దేశ, విదేశాలలో ఈయన శిష్యులు అఫ్తాల్మోజిక్ సర్జన్ లుగా అనేకమంది కీర్తి ప్రతిష్ఠలు పొందుతున్నారు. అనేక గ్రామాలలో కాటరాక్ట్ సమస్యలతో బాధపడే వారున్నారని, ఊరూరా క్యాంపులు నిర్వహించి ప్రజలను ఎడ్యుకేట్ చేశారు. ఆపరేషన్లు నిర్వహించారు. మన దేశంలో ఈ తరహాగా కంటి క్యాంపులు, నిర్వహించడం తొలిసారి. 500 క్యాంపులు, దాదాపు మూడు లక్షల కాటరేక్ట్ ఆపరేషన్లు చేశారు. సొంత డబ్బు చాలా ఖర్చు చేశారు. మొబైల్ సర్వీస్ కూడా ఆర్గనైజ్ చేశారు. రిటైర్ అయిన తర్వాత కూడా రెండు శతాబ్దాల పాటు క్యాంపులు నిర్వహించారు. రాష్ట్రంలో అన్ని ప్రాంతాలలోకూడా క్యాంపులు నిర్వహించి, తద్వారా చికిత్సతో పాటు మందులు కూడా యిచ్చేవారు. ఫుడ్ కూడా పెట్టేవారు. అద్దాలు కూడా యిచ్చేవారు. స్వంత డబ్బు కూడా వ్యయ పరిచేవారు. దేశంలో అత్యున్నత హోదాలలో ఉన్న చాలామందికి చికిత్స చేసి, "విజన్" కల్పించారు.

రెండు లక్షల యాభై వేలకు పైగా కంటి శుక్లాల ఆపరేషనులు చేసి అత్యధిక కంటి శుక్లాల ఆపరేషనులు చేసిన డాక్టరుగా గిన్నీస్ ప్రపంచ రికార్డుల కెక్కారు. భారత ప్రభుత్వం నుండి 1971లో పద్మశ్రీ, 1977లో పద్మభూషణ్ పురస్కారాలను పొందారు. ఈయన విశాఖపట్నం, వరంగల్, కర్నూలులలో ప్రాంతీయ నేత్ర వైద్యశాలల యేర్పాటుకు చాల కృషి చేశారు. 1990లో కర్నూలులో స్థాపించబడిన ప్రభుత్వ నేత్ర వైద్యశాల ఆయన పేరున స్థాపింప బడింది. ప్రఖ్యాత తెలుగు హీరో మెగాస్టార్ చిరంజీవి తన పేరున స్థాపించిన చిరంజీవి నేత్ర వైద్యశాల కొరకు శివారెడ్డి గారి సలహాలను కోరి, ఆయన సూచనలను పాటించారు.

కంటి చికిత్సలతో పాటు సోషల్ యాక్టివిటీస్ కూడా అనేకం చేశారు. గ్రంథ రచనలు చేశారు. దేశ, విదేశీ ప్రత్రికల్లో సైంటిఫిక్ ఆర్టికల్స్ అనేకం రాసారు. 1985 నుంచి భారతీయ విద్యాభవన్ కు ఛైర్మన్ గా యున్నారు. సిబిఐటి బోర్డులో ఉన్నత పదవులను అలంక రించారు. అలాసాగర్ సాంస్కృతిక సంస్థకు అధ్యక్షులుగా కొంతకాలం ఉన్నారు. ఈ విధంగా పలు సోషల్ ఏక్టివిటీస్ లో ఉండేవారు.

దేశంలోనే పేరెన్నిక గన్న సరోజినీ దేవి కంటి హాస్పటల్ కీర్తి ప్రతిష్ఠలను ఈయన సారథ్య నైపుణ్యం, మార్గదర్శకత్వాలే ప్రధాన కారణాలు. కార్నియల్ గ్రాఫ్టింగ్ రంగంలో ప్రత్యేకంగా ఘనకీర్తి నార్జించటనికి గల కారణం కూడా ఈయన ప్రతిభే. అంతర్జాతీయ మెడిసన్ జర్నల్స్ లో దాదాపు 30 పరిశోధనా పత్రాలను వెలువ రించారు. 1973 లో జర్మనీ దేశంలోని మ్యూనిచ్ లో జరిగిన ఇంటర్నేసహ్నల్ కాన్ఫరెన్స్ ఆఫ్ ఆఫ్తాల్మోలజీలో ఈయన కనుగొ న్న చాలా అరుదైన క్రిమికి (అకసేరుక జీవి) సంబంధించిన సమాచారం అందించారు. తర్వాతి కాలంలో దానికి ఈయన పేరు మీదనే Gordia Reddy అని నామకరణం చేశారు.

డాక్టర్ శివారెడ్డికి అనేక ప్రతిష్ఠాత్మక గౌరవాలు, అవార్డులు అందాయి. 1970 లో పద్మశ్రీబీ 1977 లో పద్మభూషణ్‌బీ వెంకటేశ్వర యూనివర్శిటీ వారిచే డి.ఎస్.సి. (1980) బీ 1981 లో అమెరికన్ అకాడమీ ఆఫ్ అఫ్తాల్మోలజీ వారి గెస్ట్ ఆఫ్ హానర్‌బీ 1981 లో డాక్టర్ బి.సి.రాయ్ నేషనల్ అవార్డుబీ లక్ష కాటరేక్ట్ ఆపరేషన్లు పూర్తిచేసిన సందర్భంగా దేశ ప్రధానిచే మెమెంటో బహూకరణబీ 1985 లో ఆసియా–పసిఫిక్ అకాడమీ ఆఫ్ అఫ్తాల్మోలజీ వారి జీన్ రిజాల్ మెడల్ (ఆసియా – పసిఫిక్ అకాడమీ ఆఫ్ ఆఫ్తాల్ మొకజీ వారిచే) ఆడెన్ వాలా ఒరేషన్ గోల్డ్ మెడల్ మొదలగునవి. ఈయన 2005 ఆగస్టులో పార్కిన్‌సన్స్ వ్యాధికి గురై, సెప్టెంబరు 6న గుండెపోటుతో మరణించారు. 85 ఏళ్లు జీవించి, స్ఫూర్తిదాతగా నిలిచిన డాక్టర్ శివారెడ్డి తెలుగు వారికి గర్వకారకులు, చిరస్మరణీయులు.



రామ కిష్టయ్య సంగన భట్ల..
9440595494

ప్రజా మంటలు
రచయితలకు మనవి
సామాజిక, రాజకీయ అంశాలపై విశ్లేషణాత్మక రచనలు ఆహ్వానిస్తున్నాం. జయంతి, వర్ధంతి ల రచనలకు పంపకండి. సామాజిక దృక్పథంతో, శాస్త్రీయ, తార్కిక దృష్టితో రాసిన రచనలకు ప్రాధాన్యత. మీ రచనలను వర్డ్ యూనీకోడ్, పేజ్ మేకర్ అను 7.0 ఫైల్‌లలో 350 నుండి 400 లపదాలకు మించకుండా ఈమైల్ : prajamantalu@gmail.com కు పంపండి.
ఎడిటర్.



జగిత్యాల జిల్లా మల్లాపూర్ లోని ఎస్.టీ. మినీ బాలికల గురుకుల పాఠశాలలో జరిగిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు. పాల్గొన్న ఉపాధ్యాయినీలు, బాలికలు. ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీప్రియాంక మరియు ఉపాధ్యాయినీలు బి. సుమలత, బి, సునీత, వి. శ్రీలత, జే. సులోచన, పి. జ్యోతి, పి, వనిత మరియు ఏ. నవిత, ఈ. అరుణ, ఎస్. మల్కు బాయి, తిరుపతమ్మ, విజయ, రజిత, సుగుణ లను మెమొంటో, శాలువాలతో విద్యార్థినీలు సన్మానించారు.

## రేషన్ బియ్యం పక్కదారిపై బిజెపి రాష్ట్ర అధ్యక్షుడికి ఫిర్యాదు



**జగిత్యాల సెప్టెంబర్ 05 (ప్రజామంటలు):**
జిల్లాలో పక్కదారి పడుతున్న రేషన్ బియ్యం గురించి బిజేపి రాష్ట్ర అధ్యక్షులు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కి ఫిర్యాదు చేసిన బిజెపి రాష్ట్ర నాయకులు ముదిగంటి రవీందర్ రెడ్డి. హైదరాబాద్ బీజేపీ రాష్ట్ర కార్యాలయం కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి జగిత్యాల జిల్లాలో జరుగుతున్న రేషన్ బియ్యం అక్రమ దందాపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కి ఫిర్యాదు చేశారు. నిరుపేదల కోసం ప్రభుత్వం పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యం పక్కదారి పడుతున్న పట్టించుకోని సంబంధిత పౌరసరఫరాల శాఖ అధికారులు, నాచుపల్లి గోదాంలో రెండు లారీల అక్రమ రేషన్ బియ్యం దొరికిన పట్టించుకోని సివిల్ సప్లై అధికారులని తెలిపారు. జిల్లా లలో విచ్చలవిడిగా రేషన్ బియ్యం దందా నడుస్తుందన్నరని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఈ విషయం మీద వెంటనే జగిత్యాల జిల్లా కలెక్టర్ తో మరియు సివిల్ సప్లై కమిషనర్ తో మాట్లాడారని చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. రవీందర్ రెడ్డి వెంట జగిత్యాల బిజెపి సీనియర్ నాయకులు ఏసిఎస్ రాజు, సిపెల్లి రవీందర్, లింగంపేట శ్రీనివాస్, కౌన్సిలర్ గుర్రం రాము, సతీష్, తదితరులు ఉన్నారు.

## ఆక్స్ ఫర్డ్ స్కూల్లో టీచర్స్ డే



**చిగురుమామిడి సెప్టెంబర్ 05 ( ప్రజామంటలు):**
చిగురుమామిడి మండలం ఇందుర్తి గ్రామ ఆక్స్ ఫర్డ్ పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పిల్లలు ఉపాధ్యాయులను శాలువలతో సత్కరించి ఉపాధ్యాయుల దీవెనలు పొందారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ పిల్లలు విద్యతో పాటు చక్కని క్రమశిక్షణ అలవరచుకొని జీవితంలో ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించేందుకు కృషి చేయాలన్నారు. అనతరం కరస్పాండెంట్ కూన సంపత్ మాట్లాడుతూ డా. సర్వేపల్లి రాధాకృష్ణ జీవితం లోని విశేషాలను తెలియజేస్తూ ఉపాధ్యాయ వృత్తి నుండి రాష్ట్రపతి పదవి వరకు ఎదిగి భారతరత్న లాంటి ఎన్నో అవార్డులు పొందిన వ్యక్తి అని అతన్ని మనందరం ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు అప్పాల సమ్మయ్య, ఉపాధ్యాయులు మంజుల, రూప, రమ్య, శైలజ, సనా, సంధ్య, సమత, స్వాగతిక డిగల్, మైఖేల్ కుజుర్, సావిత్రి,మాలిక్, సిబ్బంది పిల్లలు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## కాలువలో దూకి ఓ మహిళ ఆత్మహత్యయత్నం రక్షించిన బ్లూ కోర్ట్ సిబ్బంది

**జగిత్యాల సెప్టెంబర్ 05 (ప్రజామంటలు):**



జగిత్యాల జిల్లా మల్యాల క్రాస్ రోడ్డు వెళ్లే దారి లోని వరద కాలువ వద్ద ఇబ్రహీంపట్నం మండలం వేములకుర్తి గ్రామం కు చెందిన మెట్పల్లి గంగమ్మ (46) అనే మహిళ కాలువలో దూకి ఆత్మహత్యయత్నం చేసింది. అనారోగ్య బాధతో వరద కాలువలో దూకగా, స్థానికులు 100 కు సమాచారం అందించారు. దీంతో మల్యాల బ్లూ కోర్ట్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని స్థానికులతో పాటు నూకపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాస్ (ఆర్మీ) బ్లూ కోర్ట్ సిబ్బంది కలిసి వరద కాలువలో పడి ఉన్న మహిళను బయటకు తీసి రక్షించారు.

## మేరీ మాటి - మేరా దేశ్‌లో...

# ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలి

### - దేశంలోని ప్రతి పల్లె నుంచి పిడికెడు మట్టి - న్యూఢిల్లీలో అమరుల స్మారక చిహ్నం ఏర్పాటు - మీడియా సమావేశంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

**సికింద్రాబాద్ సెప్టెంబర్ 05 ( ప్రజామంటలు):**



దేశ నేతల జయంతి, వర్ధంతి కార్యక్రమాలను ప్రతి ఏడాది ఘనంగా జరుపుకుంటున్న నేపథ్యంలో అదే స్పూర్తితో కేంద్ర ప్రభుత్వం మేరీ మాటీ మేరా దేశ్ ( మన నేల నన్ను కన్న నా దేశం ) పేరుతో సెప్టెంబర్ 1 నుంచి కార్యక్రమాన్ని దేశ వ్యాప్తంగా చేపట్టిందని కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు. కవాడిగూడ లోని సీజీవో టవర్స్ లోని పీఐబీ ఆడిటోరియంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ...దేశం కోసం త్యాగాలు చేసిన అమరుల స్మారక చిహ్నాన్ని న్యూఢిల్లీ లో అమృత వనంలో కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. దేశంలోని ప్రతి పల్లె నుంచి ప్రతి ఒక్కరు పిడికెడు మట్టిని గాని పిడికెడు బియ్యాన్ని గాని కలశంలో సేకరించాలని పిలుపునిచ్చారు. అందరిని మరోసారి ఏకతాటిపైకి తెచ్చేందుకు మేరీ మాటీ మేరా దేశ్ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. సెప్టెంబర్ నెలలో అన్ని గ్రామాల నుంచి పవిత్రమైన మట్టిని సేకరించి, దాన్ని మండల కేంద్రాలకు చేర్చి, అక్కడినుంచి ప్రత్యేక కార్యక్రమాలతో జిల్లాకు, ఆ తర్వాత రాష్ట్ర రాజధానికి తీసుకొస్తామన్నారు. చివరికి రాష్ట్రాల రాజధానుల నుంచి ఢిల్లీలో కర్తవ్య పథ్ లో ఘనంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. అక్కడి అమృత్ పార్కులో 75వేల మొక్కలను నాటి దాదాపు 7500 కలశాల ద్వారా వచ్చిన మట్టిని కర్తవ్యపథ్ లో వార్ మెమోరియల్ పక్కనున్న స్థలంలో పెట్టి అమర వీరుల స్మారకంగా అమృత వనాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. అక్టోబర్ 31 న సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి జాతీయ ఐక్యతా దినోత్సవం సందర్భంగా ముగింపు కార్యక్రమం ఉంటుందన్నారు. 2047 నాటికి దేశాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేయడంలో 140 కోట్ల మంది ప్రజలు రాజకీయాలకు అతీతంగా, సిద్ధాంతాలను, కుల, మతాలను పక్కన పెట్టి అభివృద్ధి చెందిన దేశంగా అభివృద్ధి చేయడంలో మన వంతు పాత్రను పోషిస్తామని మేరీ మాటీ..మేరా దేశ్ అని దేశ ప్రజలతో ప్రతిజ్ఞ చేయించాలని కేంద్రం నిర్ణయించిందన్నారు. గత ఏడాది సెప్టెంబర్ 17న కేంద్ర ప్రభుత్వం తరఫున అధికారికంగా నిర్వహించినట్లుగానే ఈసారి కూడా తెలంగాణ విమోచన ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామన్నారు. గత ప్రభుత్వాలు విమోచన దినోత్సవాలు అధికారికంగా నిర్వహిస్తామని చెప్పి, మజ్లిస్ పార్టీని సంతృప్తి పరిచేందుకు ఈ కార్యక్రమాన్ని విస్మరించాయని, మనకు నిజాం నియంతృత్వం నుంచి విమోచనం జరిగిన రోజున మనం ఉత్సవాలు కూడా జరుపుకోలేని దౌర్భాగ్య స్థితిలో మనం ఉన్నామన్నారు. 1948 నాడు అప్పటి హోం మంత్రి పటేల్ త్రివర్ణ పతాకం ఎగరేస్తే గతేడాది ప్రస్తుత హోంమంత్రి అమిత్ షా జెండా ఎగరేశారు. ఈ స్పూర్తిని ఇక ముందు కూడ కేంద్ర ప్రభుత్వం తెలంగాణలో కొనసాగిస్తుందన్నారు.

## ఎన్నికల నిర్వహణలో సెక్టార్ పోలీస్ సెక్టార్ అధికారుల పాత్ర కీలకం : జిల్లా కలెక్టర్ యాస్మిన్ భాష

**జగిత్యాల సెప్టెంబర్ 05 (ప్రజామంటలు):**
ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు ప్రకారం నిబంధనలు పాటిస్తూ ప్రజాస్వామ్యబ ద్ధంగా అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాలని, వీటిలో సెక్టార్, పోలీస్ సెక్టార్ అధికారుల పాత్ర కీలకమైందని కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషా అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సెక్టోరల్ మరియు సెక్టర్ పోలీస్ ఆఫీసర్స్ అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఎస్పీ ఈ. భాస్కర్ అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు దివాకర, అదనపు కలెక్టర్ రెవిన్యూ బి ఎస్ లత సంబంధిత అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషా ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.... జగిత్యాల జిల్లా మూడు నియోజకవర్గాల పరిధిలో ఉన్న 785 పోలింగ్ కేంద్రాల పరిధిలో ఎన్నికల విధులు పర్యవేక్షణకు78 .రూట్లలో 78 సెక్టార్ అధికారులను నియమించామని, వీరికి అదనంగా మరో 20 శాతం సెక్టార్ అధికారులను రిజర్వ్ కింద ఏర్పాటు చేశామని, సెక్టర్ అధికారులు ఎన్నికలకు సంబంధించిన అన్ని అంశాల పైన, పోలింగ్ జరుగుతేదిన ఎన్నికల రిటర్నింగ్ అధికారి కి అత్యంత కీలకంగా వ్యవవరిస్తారని అన్నారు. పోలింగ్ నిర్వహణకు ముందు సెక్టార్ అధికారులు వారి పరిధిలోని పోలింగ్ కేంద్రాల రూట్ మ్యాప్ పరిశీలించాలని, పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన మౌలిక వసతులు కల్పన పరిశీలించాలని, నూతన పోలింగ్ కేంద్రాలపై విస్తృత ప్రచారం కల్పించాలని, పోలింగ్ కేంద్రాలకు రెండు వందల మీటర్ల పరిధిలో పార్టీ ఆఫీసులు లేకుండా పరిశీలించాలని, అనుమతి లేని ప్రచార వాహనాలు, ప్రభుత్వ భవనాలు ఉద్యోగుల వాహనాల వినియోగం, ఎంసీసీ నిబంధన ఉల్లంఘన పై నిఘా ఉంచాలని, వ్యక్తిగతంగా పోలింగ్ కేంద్రాలను సందర్శించకుండా రూట్ మ్యాప్ ఫైనల్ చేయవద్దని, రిపోర్ట్ చేయడం మర్చిపోవద్దని కలెక్టర్ తెలిపారు. పోలింగ్ కు ముందు నిర్వహించే ఓటరు సవరణ షెడ్యూల్ పై ప్రస్తుత ప్రచారం నిర్వహించాలని, అధికారి వద్ద ఉన్న ఓటర్ జాబితాలో పేర్లు చూసుకునే విధంగా ఓటర్లకు సమాచారం అందించాలని, ఈవిఎం



వినియోగంపై విస్తృత ప్రచారం కల్పించాలని, పోలింగ్ కు ఐదు రోజుల ముందు ఓటరు స్లిప్పుల పంపిణీ జరిగేలా బూత్ స్థాయి అధికారులను పర్యవేక్షించాలని , ఏ రాజకీయ పార్టీకి చెందిన వ్యక్తులు స్వతంత్ర అభ్యర్థులతో ఎటువంటి సంబంధాలు పెట్టుకోవద్దని, పోలింగ్ నాడు రిజర్ ఈవీఎం యంత్రాలు, ఎక్స్ట్రా పవర్ బ్యాక్ లు సేకరించాలని, ప్రతి పోలింగ్ కేంద్రంలో పోలింగ్ సామాగ్రి చేరే విధంగా చర్యలు తీసుకోవాలని, పోలింగ్ కేంద్రం వద్ద అవసరమైన భద్రత ఉండేలా చూసుకోవాలని, పోలింగ్ సిబ్బందికి చివరి నిమిషంలో వచ్చే సందేహాలను నివృత్తి చేయాలని, పోలింగ్ బూత్ వద్ద ఓటరు సహాయ కేంద్రాల ఏర్పాటు పరిశీలించాలని కంట్రోల్ రూమ్ పంపాలని తెలిపారు. సెక్టర్ అధికారులు ప్రైవేట్ వాహనాలు వినియోగించవద్దని, అదనపు ఈవీఎం యంత్రాలను స్టిక్కర్లు లేకుండా పెట్టుకోవద్దని మీడియాతో అభ్యర్థులతో రాజకీయ పార్టీలతో సంప్రదించవద్దని పేర్కొన్నారు.ఎన్నికల కమిషన్ నిర్దేశించిన నిబంధనలు ప్రకారం ఎన్నికలను ఎటువంటి పొరపాట్లు జరుగకుండా చూసుకోవాలని, ఎన్నికలకు సంబంధించి ప్రతి అంశంపై అధికారులు సంపూర్ణ పరిజ్ఞానం కలిగి ఉండాలి. ఒకటికి రెండుసార్లు విషయాలు తెలుసుకొని పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జగిత్యాల ఆర్డిఓ నరసింహమూర్తి కోరుట్ల ఆర్డిఓ రాజశేఖర్ మాస్టర్ ట్రైనర్స్ కార్ సుదీర్, డాక్టర్ తిరుపతి సెక్టోరియల్ మరియు పోలీస్ సెక్టార్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బాయిస్, లయన్స్ ఆధ్వర్యంలో జరిగిన గురుపూజోత్సవం గురువు దిక్సూచి లాంటివాడు

### - లయన్ కన్నా విద్యార్థులకు స్కూల్ బ్యాగ్ లు, నోట్ బుక్స్ వితరణ



**జనగామ సెప్టెంబర్ 05 (ప్రజామంటలు):**
సమాజంలోని ప్రతి వ్యక్తికీ గురువు దిక్సూచి లాంటివాడు అని లయన్స్ ఇంటర్నేషనల్ 320ఎఫ్ జిల్లా తక్షణ పూర్వ జిల్లా గవర్నర్, మల్టిపుల్ జిల్లా సంయుక్త కార్యదర్శి లయన్ కన్న పరశురాములు అన్నారు. లయన్స్ క్లబ్ జనగామ బిబాయిస్ ఆధ్వర్యంలో చౌడారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఉదయం జరిగిన గురుపూజోత్సవం లో కన్నా ముఖ్య అతిథి గా పాల్గొని ప్రసంగించారు. క్లబ్ అధ్యక్షుడు లగిశెట్టి కిషోర్ కుమార్ అధ్యక్షత వహించిన ఈ సభలో కన్న పరశురాములు మాట్లాడుతూ గురువును ప్రతి ఒక్కరూ ఆరాధ్య దైవంగా భావించాలని అన్నారు. లయన్స్ క్లబ్ లు తాము విధిగా పాటించే వేడుకలలో టీచర్స్ డే ఒకటని అంటూ భారత దేశంలో ఉన్న సుమారు పది వేల క్లబ్ లు భారత దేశ ద్వితీయ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సందర్భంగా గురుపూజోత్సవం నిర్వహించి ఉపాధ్యాయులను సన్మానించడం అభినందనీయం అని అన్నారు. బీ బాయిస్ క్లబ్ సభ్యులు ఈ రోజు 12 మంది గురువులను సన్మానించడం అభినందనీయం అని అన్నారు. సమావేశంలో పాల్గొన్న ప్రత్యేక ఆహ్వానితులు జిల్లా జి. యస్.టి. చైర్మన్ ప్రముఖ న్యాయవాది ప్రసాద రావు, రీజియన్ చైర్మన్ కదిరె రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.... రెండేళ్ల వయ్యసు గల క్లబ్ రెండు దశాబ్దాల అనుభవం గల క్లబ్ స్థాయిలో కార్యక్రమాలు నిర్వహిస్తున్న క్లబ్ సభ్యులను అభినందించారు. సన్మాన గ్రహీతల పక్షాన స్పందించిన ప్రధానోపాధ్యాయుడు జి. రమేశ్ బాబు మాట్లాడుతూ లయన్స్ అంతర్జాతీయ సంస్థ పక్షాన జరిగిన సన్మానం మాకు మధురానుభూతి అని మేము మావృత్తిని నిబద్ధత, అంకితభావంతో చేయడానికి ప్రోత్సాహం అని అన్నారు. వీరితోపాటు ఉపాధ్యాయులు బి. రాజేశ్వర్ ,పి. సత్యనారాయణ, ఎం . శేషగిరి రావు, ఏ. శ్రీధర్, వి. శ్రీనివాసాచారి, ఐ . ఉమాదేవి, ఎం. ఉప్పలయ్య, ఎం డి. కుద్దుసు, ఎల్. లాల్మ, వి. పద్మిని లను శాలువా, ధృవ పత్ర జ్ఞాపిక తో ఘనంగా సన్మానము పొందారు. సమావేశంలో పాల్గొన్న గ్రామ ప్రముఖులు తమ గ్రామాన్ని దత్తత తీసుకుని ఇక్కడ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న క్లబ్ సభ్యులు, వీరికి సూచన చేసిన గ్రామానికి చెందిన సాఫ్ట్వేర్ ఉద్యోగి చెరుకూరి వెంకటేశ్వర్లుకు కృత్జతలు తెలిపారు. ఇంకా ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి కన్న శ్రీనివాస్, కోశాధికారి డా. డి. శివశంకర్ రావు, సభ్యులు కే. శ్రీకాంత్, రాజు, బాలకిషన్, పి. మధు, కే. రాకేశ్ గ్రామ సర్పంచ్ ఎం. రాజయ్య, చీటాకోడురు సర్పంచ్ కొత్త దీపక్ రెడ్డి మాజీ సర్పంచ్ దూడల సిద్ధయ్య గౌడ్, పాటశాల ఎస్ ఎం సి చైర్మన్ వై. పరశురాములు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉన్నత, ప్రాథమిక పాఠశాలలకు చెందిన వంద మంది విద్యార్థులకు స్కూల్ బ్యాగ్ లు, నోట్ బుక్స్ వితరణ చేసారు.

## ఎస్.ఎస్.ఎస్.ఎం. డిజి స్కూల్లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు



**జగిత్యాల సెప్టెంబర్ 4 (ప్రజా మంటలు)**
జిల్లా కేంద్రంలోని ఎస్ఎస్ఎస్ ఎం డిజి హై స్కూల్లో మంగళవారం స్వయం పరిపాలన దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వార్డు కౌన్సిలర్ అనుమల్ల కృష్ణహరి విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలవేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తమ అనుభవాలను తోటి విద్యార్థులకు తెలియజేశారు. స్వయంపాలన దినోత్సవం లో ఉత్తమ బోధన చేసిన ఛాత్రోపాధ్యాయులకు బహుమతులు అందజేసి సర్వేపల్లి రాధాకృష్ణ జీవితాన్ని విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని కౌన్సిలర్ కృష్ణ హరి అన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఏ. రాజేందర్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, ఛాత్రోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ ఓటు హక్కునమోదుతో పాటు ఓటు హక్కును వినియోగించుకోవాలి : జిల్లా కలెక్టర్



**జగిత్యాల సెప్టెంబర్ 05 (ప్రజామంటలు):**
ప్రజాస్వామ్యంలో మనకోసం మన భవిష్యత్తు కోసం నిజమైన నాయకుడిని ఎన్నుకోవాలంటే ఓటు హక్కు నమోదుతో పాటు ఆ హక్కును వినియోగించుకోవడం తప్పనిసరి అని ఇందుకోసం ట్రాన్స్ జెండర్స్ ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ యాస్మిన్ భాషా పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కలెక్టర్ కార్యాలయ ఓటు అవగాహన కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ లోని జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో ట్రాంజెండర్లకు ఓటర్ అవగాహన కల్పించి ఓటు హక్కు లేని వారికి ఓటు నమోదు చేయించబడింది. ఈ కార్యక్రమంలో ట్రాన్స్ జెండర్ తో జిల్లా కలెక్టర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఓటు ప్రక్రియలో పురుషులు మహిళతో పాటు మూడవ జెండర్ కింద నమోదుకు అవకాశం కల్పించడం జరిగిందని, జిల్లాలోని ట్రాన్స్ జెండర్స్ అందరూ ఓటు నమోదు, మరియు వివరాలు మార్పు కై దరఖాస్తు చేసుకుని ఎన్నికలలో ఓటు హక్కు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ట్రాంజెండర్ల ప్రతినిధులు నిహారిక ప్రశాంతి లను ఓటర్ అవగాహన కార్యక్రమాల విస్తరణకు ప్రచార కార్యకర్తలుగా ఎంపికైనారు. ట్రాన్స్ జెండర్లలను గుర్తించి ఓటరు నమోదులో అవకాశం కల్పించిన కల్పించినందుకు భారత ఎన్నికల సంఘంకి, జిల్లా కలెక్టర్ కి ధన్యవాదాలు తెలియజేశారు. ట్రాన్స్ జెండర్స్ కలెక్టరేట్ కార్యాలయంలో క్యాంటీన్ ఏర్పాటు చేసుకుంటామని, రేషన్ కార్డ్స్ మంజూరు చేయాలని, మహిళా సంఘాల ఏర్పాటుకు అవకాశం కల్పించాలని విన్నవించారు. ఇట్టి కార్యక్రమంలో నోడల్ అధికారి మరియు ఈడి ఎస్సీ కార్పొరేషన్ లక్ష్మీనారాయణ, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నరేష్, జిల్లా సంక్షేమ అధికారి నరేష్, మెప్మా శ్రీనివాస్ గౌడ్ ఫీల్డ్, ఆఫీసర్ కొండయ్య సీనియర్ అసిస్టెంట్ చంద్రమోహన్, మహిళ శిక్షణ కో ఆర్డినేటర్ నవ్య, ట్రాంజెండర్లు మరియు ఇతరులు పాల్గొన్నారు.

## దర్గా కు నష్టం జరగకుండా రోడ్డు మార్కింగ్ చేపట్టాలి

### - హం సాథ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు యాకుబ్ పాషా



**జనగామ సెప్టెంబర్ 05 (ప్రజామంటలు):**
జనగామ పట్టణ శివారు హైదరాబాద్ రోడ్డు పక్కన హజ్రత్ సయ్యద్ యాకుబ్ షా వాలి దర్గా మీదుగా జనగామ నుండి సిద్దిపేట రోడ్డు చంపకిల్స్ వరకు చేపట్టే ఔటర్ రింగ్ రోడ్డు పనుల లో భాగంగా దర్గా నష్టం చేకూర్చే విధంగా మార్కింగ్ ను చేపట్టగా ఇట్టి మార్కింగ్ ను పక్కకు మార్చి పనులు చేపట్టాలని ఆర్ అండ్ బి కంపెని ప్రతినిధులకు దర్గా కమిటీ సభ్యులు వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం దర్గా కమిటీ ప్రధాన కార్యదర్శి,హం సాథ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మహమ్మద్ యాకుబ్ పాషా మాట్లాడుతూ.... ఇట్టి చరిత్ర కలిగిన దర్గాకు నష్టం జరగకుండా మార్కింగ్ పక్కకు మార్చి రోడ్డు పనులు చేపట్టాలని ఆర్ అండ్ బి కంపెనీ వారికి వినతి పత్రం అందజేశామని దీనికి వారు సానుకూలంగా స్పందించారని అలాగే దర్గాకు వచ్చే భక్తుల మనోభావాలను దృష్టిలో పెట్టుకొని జనగామ ప్రజా ప్రతినిధులు మరియు పార్లమెంటు సభ్యులు ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఇట్టి దర్గా విషయంలో చొరవ చూపి మార్కింగ్ ను పక్కకు మార్చే విధంగా కృషి చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మహమ్మద్ ఇస్మాయిల్, మహమ్మద్ పాషా, మహమ్మద్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం మండలం వర్ష కొండ గ్రామంలోని అక్షర భారతి కాన్వెంట్ స్కూల్లో ముందస్తు శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహించగా ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థినీ విద్యార్థులు.

## భాజపా ధర్మపురి అసెంబ్లీ మహిళా కన్వీనర్ గా సింగు అంజలి నియామకం

**గొల్లపల్లి సెప్టెంబర్ 05 (ప్రజామంటలు):**
గొల్లపల్లి మండలం శ్రీరాములపల్లి గ్రామానికి చెందిన సింగు అంజలి ని భారతీయ జనతా పార్టీ మహిళా మోర్చా జగిత్యాల జిల్లా మహిళ మోర్చ అధ్యక్షురాలు సురతాని భాగ్యలక్ష్మి నియామక పత్రాన్ని



అందజేశారు. ఈ సందర్భంగా అంజలి మాట్లాడుతూ.... ధర్మపురి నియోజకవర్గంలో పార్టీ కోసం నిరంతరం పనిచేస్తూ ధర్మపురి నియోజకవర్గంలో బిజెపి జెండా ఎగరవేసే లక్ష్యంగా పనిచేస్తానని అన్నారు తమకు అప్పజెప్పిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తానని మహిళల అభ్యున్నతి కోసం నిరంతరం పనిచేస్తానని అన్నారు. తన నియామకానికి సహకరించిన మాజీ ఎంపీ వివేక వెంకటస్వామి కీ, జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ రావు కి, మహిళా మోర్చా అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి కి, మండల అధ్యక్షుడు కట్ట మహేష్ కు కృతజ్ఞతలు తెలిపారు

## తైక్వండో క్రీడాకారిణి "రుద్ర" అంతర్జాతీయ పతకం సాధించాలి పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి



**జనగామ సెప్టెంబర్ 05 (ప్రజామంటలు):**
జనగామ జిల్లా నుండి అస్సాం రాష్ట్రం గౌహతి లో జరిగే జాతీయ స్థాయి తైక్వండో పోటీల్లో పాల్గొంటున్న అబ్బాస్ తైక్వాండో అకాడమీ క్రీడాకారిణి మంగళవారం ఎం.ఎల్.సి. పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలువగా తను సాధించిన విజయాలు తెలుసుకొని రుద్ర ను, అబ్బాస్ మాస్టర్ ను అభినందించి వారు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనుటకు ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా రుద్ర మాట్లాడుతూ తన శిక్షణకు, విజయాలు సాధించేందుకు సహకరిస్తున్న బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఇమ్మడి శ్రీనివాస్ రెడ్డి కి, తనను అభినందించి, అంతర్జాతీయ పోటీలకు వెళ్ళుటకు సహకరిస్తానని తెలిపిన ఎం.ఎల్.సి పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి కి ధన్యవాదాలు తెలిపారు.

## ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు



**జగిత్యాల సెప్టెంబర్ 05 ( ప్రజామంటలు):**
సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా జగిత్యాలలోని ముద్దు రామకృష్ణయ్య మెమోరియల్ సేవాసదన్ ప్రధాన కార్యదర్శి సూరజ్ శివశంకర్ ఆధ్వర్యంలో స్థానిక వైశ్యభవన్ లో మంగళవారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో పలువురు శిష్యులు పాల్గొని, రామ కృష్ణయ్య చిత్రపటానికి పూలమాలలు సమర్పించి, నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు శిష్యులు మాట్లాడుతూ తల్లిదండ్రుల తరువాత స్థానం విద్యాబుద్దులు నేర్పిన గురువులదేనని, విద్యార్థుల జీవితాలలో వెలుగులు నింపేది గురువులేనని, ఉపాధ్యాయులు అందించిన విజ్ఞానంతోనే ఉన్నత స్థాయిలోకి ఎదగటానికి దోహదపడిందని కొనియాడారు. ఆరు దశాబ్దాల క్రితం జగిత్యాల మల్టీపర్పస్ హైస్కూల్ లో ఉద్యోగ భాద్యతలు చేపట్టిన ముద్దు రామకృష్ణయ్య గొప్ప మానవతావాది, పండితుడు, తత్వవేత్త అనీ.. విదేశాల్లోని ఆధునిక, సాంకేతిక పరిజ్ఞాన విద్యావిధాన పద్ధతులను ఇక్కడి విద్యార్థులకు నేర్పించారనీ సూరజ్ శివశంకర్ గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎలిమెల్ల సత్తయ్య, ఎర్ర తిరుపతి, అయ్యవారి లక్ష్మీనారాయణ, బాలగంగాధర్, తాటిపెల్లి ఆనందం, ఆవారి కైలాసం, అలిశెట్టి ఈశ్వరయ్య, కస్తూరి కిషన్, వైని లచ్చన్న, కప్పుల చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

### - ప్రైవేట్ పాఠశాలలకు దక్కిన చోటు హుజూరాబాద్ నుండి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన విజ్ఞాన్ స్కూల్ కరస్పాండెంట్ దాసరి కోటేశ్వర్



**హుజూరాబాద్ సెప్టెంబర్ 05 (ప్రజామంటలు):**
డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జన్మదినం సెప్టెంబర్ 5 ను పురస్కరించుకొని కరీంనగర్ జిల్లా హుజురాబాద్ నియోజకవర్గం వ్యాప్తంగా టీచర్స్ డే ని ఘనంగా జరుపుకున్నారు. ఇదే సందర్భంగా జిల్లాస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ప్రభుత్వ మరియు ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులను కూడా ఉత్తమ ఉపాధ్యాయులుగా జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఎంపిక చేసి వారిని కరీంనగర్ జిల్లా కలెక్టరేట్ ఆడిటోరియం లో జిల్లా కలెక్టర్ గోపి మరియు విద్యా శాఖ అధికారి జనార్ధన్ రావు అధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలలో ముఖ్య అతిథిగా మంత్రి గంగుల కమలాకర్ విచ్చేసి అవార్డు గ్రహీత లను ఘనంగా సత్కరించడం జరిగింది. ఈ సందర్భంగా హుజూరాబాద్ నుండి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన విజ్ఞాన్ స్కూల్ కరస్పాండెంట్ దాసరి కోటేశ్వర్ ను ముఖ్యఅతిథిలు మంత్రి గంగుల కమలాకర్ చేతుల మీదుగా మెమొంటో, ప్రశంసా పత్రం అందజేసి శాలువాతో సత్కరించారు. ఎమ్మెల్యేలు సుంకె రవిశంకర్, రసమయి బాలకిషన్, కలెక్టర్, డిఇఓ అలాగే ట్రస్మా ప్రెసిడెంట్ యాదగిరి శేఖర్ రావు, ట్రస్మా హుజూరాబాద్ మండల ప్రెసిడెంట్ బద్దుల రాజకుమార్ లు హాజరై అభినందించడం జరిగింది. ఈ అవార్డ్ రావడం పట్ల విజ్ఞాన్ స్కూల్ డైరెక్టర్ తిరుపతి యాదవ్, ప్రిన్సిపాల్ కొండబత్తిని శ్రీనివాస్, ఉపాధ్యాయుల బృందం హర్షం వ్యక్తం చేశారు. విజ్ఞాన్ స్కూల్ వేడుకలు.... పాఠశాల కరస్పాండెంట్ విజ్ఞాన్ పాఠశాలలో జరుగుతున్న ఉపాధ్యాయ దినోత్సవం కార్యక్రమానికి హాజరుగా విద్యార్థులందరూ లేచి నిలబడి చప్పట్లతో ఆహ్వానించారు. తదనంతరం పాఠశాలలో కూడా, పాఠశాల కరస్పాండెంట్ కి మరొకసారి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. తధనంతరం పాఠశాలలోని టీచర్లందరికీ కూడా ఫెలిసిటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించి పాఠశాలలోని టీచర్లందరినీ శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ దాసరి కోటేశ్వర్, డైరెక్టర్ తిరుపతి యాదవ్, ప్రిన్సిపాల్ కొండబత్తిని శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి : జిల్లా కలెక్టర్ షేక్ యాష్మిన్ భాషా

### - జగిత్యాల కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు 08724222557

**జగిత్యాల సెప్టెంబర్ 05 (ప్రజామంటలు):**
జిల్లాలో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో అధికారులు, క్షేత్ర సిబ్బంది ప్రజలు అలెర్ట్ గా ఉండాలని జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషా అన్నారు. మంగళవారం చీఫ్ సెక్రటరీ శాంతి కుమారి హైదరాబాద్ నుంచి భారీ వర్షాలు వరదలపై వివిధ జిల్లాల్లోని జిల్లా కలెక్టర్లతో హైదరాబాదు నుండి సెల్ కాన్ఫరెన్స్ ద్వారా తగు ఆదేశాలు జారీ చేశారు. జగిత్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయం నుండి షేక్ యాస్మిన్ బాషా టెలికాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి డిఆర్ డిఓ, పంచాయతీ రాజ్, రెవిన్యూ, విద్యుత్, ఇరిగేషన్, ఆర్ అండ్ బి, వైద్య ఆరోగ్య శాఖ, మత్స్యశాఖ అధికారులకు భారీ వర్షాలపై పలు సూచనలు చేస్తూ జిల్లాలో రానున్న రోజులు భారీ వర్ష సూచన దృష్ట్యా అధికారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేపట్టాల్సిన చర్యలపై అప్రమత్తంగా వ్యవహరించాలని అన్నారు. వాతావరణ శాఖ కొన్ని జిల్లాల్లో భారీ వర్షాల కారణంగా ఆరెంజ్, రెడ్ ఎలర్ట్ లను జారీ చేసిన నేపథ్యంలో వాటిని పరిగణలోకి తీసుకొని పక్క జిల్లాల్లోనే ఉన్న పరిస్థితులను తెలుసుకుంటూ మన జిల్లా పరిస్థితిని ఎప్పటికప్పుడు బేరీజు వేసుకొని గతంలో ఫ్లడ్ ఎఫెక్టెడ్ ఏరియాలను దృష్టిలో ఉంచుకొని అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. జిల్లాలో ఒక్క ప్రాణ నష్టం జరగకుండా అధికారులు అవసరమైన అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో సీరియస్ గా దృష్టి పెట్టి సంబంధిత ప్రభుత్వ విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. క్షేత్ర స్థాయిలో ఉంటూ... సమస్యలకు పరిష్కారం చూపాలన్నారు. నెల రోజుల్లో ప్రసవాలు జరిగే అవకాశం ఉన్న గర్భిణిలను వెంటనే పరిస్థితిని బట్టి ఆసుపత్రులు దగ్గర ఉండే రక్షణ ప్రదేశాలకు గర్భిణీ స్థితిగతులను బట్టి జిల్లా ఆసుపత్రి, ఏరియా ఆసుపత్రి, సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కు కూడా తక్షణమే తహశీల్దార్ లు సంబంధిత మెడికల్ ఆఫీసర్లను సమన్వయం చేసుకుని షిఫ్ట్ చేయాలన్నారు. నీరు ఓవర్ ఫ్లో అవుతున్న లో లెవెల్ వంతెన లు, రాకపోకలు సాగించే రోడ్ల పై ప్రవహిస్తున్న నీటి వద్ద 24 గంటలు మానిటరింగ్



ఉంచాలన్నారు. రాకపోకలు జరగకుండా చూడాలన్నారు. స్ట్రీమ్ ల పరివాహక ప్రాంతం లోకి పశువులు, గొర్రెలు, మత్స్యకార్మికులు, రైతులు వెళ్లకుండా అప్రమత్తం చేయాలని చెప్పారు. జిల్లా లోని జలాశయాలు, చెరువుల నీటి మట్టాలను రౌండ్ ద క్లాక్ ఇరిగేషన్ ఇంజనీర్ లు కని పెట్టుకోనేలా ఏ ఈ ఈ లకు డ్యూటీ లు వేయాలని జిల్లా ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. జిల్లా మత్స్య శాఖ అధికారి మత్స్యకారులు చేపల వేటకు వెళ్లి ప్రమాదాల బారిన పడకుండా వారిని అప్రమత్తం చేసే దిశగా కృషి చేయాలన్నారు. చెరువులు నిండిన చోట, ఓవర్ ఫ్లో అయిన చోట మానిటరింగ్ ఆఫీసర్ లను వెంటనే పెట్టాలన్నారు. నీటి ప్రవాహం ఉన్న లో లెవెల్ వంతెన, రోడ్లలో హెచ్చరిక ఫ్లెక్సీ లతో పాటు మానిటరింగ్ ఆఫీసర్ ఉండాలన్నారు. ఒర్రెలు, వాగుల్లో నీటి ప్రవాహం ఉన్నందున వాటిని దాటి రైతులు పంట క్షేత్రాలకు వెళ్లకుండా చూడాలన్నారు. లో లెవెల్ ప్రాంతాల్లో నివాసం ఉంటున్న ప్రజల సమస్యలపై ఎంపీడీవోలు తహశీల్దార్ లు తమ మండలాల పరిధిలో పరిస్థితులకు కనిపెట్టుకుని సమస్యల పై వెంటనే స్పందించాలని చెప్పారు. విద్యుత్ అంతరాయం జరగకుండా, ప్రమాదాలు, కరెంట్ షాక్ లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలనీ విద్యుత్ అధికారులకి సూచించారు. ఈ టెలి కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు దివాకర అదనపు కలెక్టర్ రెవిన్యూ బిఎస్ లత సంబంధిత ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఈనెల 7న కొర్వి కృష్ణస్వామి జయంతి ఉత్సవాలు పలు సేవా కార్యక్రమాల నిర్వహణ



**సికింద్రాబాద్ సెప్టెంబర్ 05 (ప్రజామంటలు):**
హైదరాబాద్ సిటీ మాజీ మేయర్, ముదిరాజ్ సంఘ వ్యవస్థాపకులు, సంఘ సంస్కర్త కొర్వి కృష్ణస్వామి ముదిరాజ్ 130 వ జయంతి ఉత్సవాలను ఈనెల 7న న్యూ బోయిగూడ లోని రాష్ట్ర ముదిరాజ్ భవన్ లో నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఉత్సవాలకు సంబందించిన పోస్టర్ ను ఆవిష్కరించిన తర్వాత వారు మాట్లాడుతూ....ఆ రోజున వివిద రంగాల్లో ప్రతిభ కనబర్చిన వారికి సన్మానంతో పాటు పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామని, జయంతి ఉత్సవాలకు ముఖ్య అతిథిగా తెలంగాణ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అద్యక్షులు , అఖిల భారత ముదిరాజ్ మహాసభ అద్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ హజరవుతారన్నారు. కృష్ణస్వామి జయంతి వేడుకలకు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల నుంచి ముదిరాజ్ సోదరులు హజరుకావాలని ఉత్సవాల నిర్వహకులు రావుల జగదీశ్వర ప్రసాద్, ప్రకాశ్, రాజాపతి, ఆంజనేయులు, దివాకర్, సురేందర్, మోహన్ రావు, వెంకటేశ్వర్లు, శారద, శ్రీకాంత్ , మంద శ్రీనివాస్ లు కోరారు.

## చిన్నారులకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్న మర్రి ఆదిత్య రెడ్డి

### - అంగన్ వాడీ కేంద్రానికి పర్నీచర్, ఆట వస్తువులు అందజేత



**సికింద్రాబాద్ సెప్టెంబర్ 05 ( ప్రజామంటలు):**
అంగన్‌వాడీ చిన్నారులకు ఇచ్చిన మాటను ఎంసీఆర్ఎఫ్ ఛైర్మన్, టీపీసీసీ సభ్యులు మర్రి ఆదిత్య రెడ్డి నిలబెట్టుకున్నారు. ఇటీవల బన్సీలాల్‌పేట్ పరిధిలోని హమాలీ బస్తీలో పర్యటించిన ఆయన స్థానిక అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. విద్యార్థులకు నాణ్యమైన సౌకర్యాలు అందేలా అన్ని ఏర్పాట్లు చేస్తానని మాటిచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రానికి ప్రీ స్కూల్ మెటిరీయల్ పంపిణీ చేశారు. కుర్చీలు, బల్లలు, లంచ్ బాక్సులు, ఇతర ఆట వస్తువులను అందజేశారు. అలాగే అంగన్‌వాడీ టీచర్లను సన్మానించారు. ఈ సందర్భంగా మర్రి ఆదిత్య రెడ్డి మాట్లాడుతూ....చిన్నారులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ఎల్లప్పుడూ సహకారం అందిస్తానన్నారు. సనత్ నగర్ ప్రజల సమస్యలు తీర్చేందుకు అనునిత్యం అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎన్.విఠల్, రమణ, శైలేశ్, శివ లాల్, రాము, సురేశ్, ఆర్. కృష్ణ, హేమలత, వి. సత్యనారాయణ, రాజు తదితరులు పాల్గొన్నారు.

## సనాతన ధర్మంపై ఉదయనిధి వ్యాఖ్యలు అభ్యంతరకరం

**సికింద్రాబాద్ సెప్టెంబర్ 05 (ప్రజామంటలు):**
సనాతన ధర్మంపై తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్ వ్యాఖ్యలపై



మేడిబావి ఆర్యసమాజ్ ప్రెసిడెంట్ ఎం.ఆర్. రవీందర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆయన మంగళవారం వేడిబావిలో మీడియాతో మాట్లాడుతూ.... కోట్లాది మంది మనోభావాలను కించపరచడం, వారి విశ్వాసాలను దెబ్బతీయడానికి ప్రయత్నించడం సరికాదన్నారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం ఉదయనిధి ఈ వ్యాఖ్యలు చేశారని ఆయన ఆరోపించారు. వెంటనే ఉదయనిధి తన వ్యాఖ్యలపై హిందూ సమాజానికి బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కోట్లాది మంది ప్రజల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందన్నారు. ఇలాగే ఇతర మత విశ్వాసాలపై మంత్రి ఉదయనిధికి కామెంట్లు చేసే ధైర్యం ఉందా...అని ప్రశ్నించారు. ఉదయనిధి తన నోరును అదుపులో పెట్టుకోవాలని ఆర్య సమాజ్ సభ్యులు సూచించారు

## బీసీ ల సింహగర్జన పోస్టర్ ఆవిష్కరణ



**హైదరాబాద్ సరూర్ నగర్ సెప్టెంబర్ 05 (ప్రజామంటలు):**
ఈనెల 10న హైదరాబాద్ సరూర్ నగర్ స్టేడియంలో నిర్వహించబోయే బీసీల సింహ గర్జన పోస్టర్ ను జిల్లా కేంద్రంలో బీసీ సంక్షేమ జిల్లా సంఘం అధ్యక్షులు బ్రహ్మాండభేరి నరేష్ తదితరులు ఆవిష్కరించారు. జనాభా దామాషా ప్రకారం తమకు చట్టసభల్లో తామెంతో తమకంతా అన్న పద్ధతుల్లో సీట్లు ఇవ్వాలని నరేష్ డిమాండ్ చేశారు. పార్టీలకతీతంగా బీసీ లందరూ సభకు విచ్చేసి బీసీ సింహ గర్జనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు గాజుల నాగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి భూమి రమణ జిల్లా మహిళా అధ్యక్షురాలు జలజ తదితరులు పాల్గొన్నారు.

## నిరు పేద కుటుంబాలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఆర్డీవో కార్యాలయం ముందు సిపిఎం, ఇళ్ల స్థలాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఆందోళన



**జగిత్యాల సెప్టెంబర్ 05 (ప్రజామంటలు):**
జగిత్యాల రూరల్ అర్బన్ మండలి కేంద్రాలలో పేద కుటుంబలకు ఇళ్ల స్థలాల కోసం భూములు ఇవ్వాలని సీపీఐఎం ఆధ్వర్యంలో గత 12 రోజుల నుండి ఆందోళన చేస్తున్న నిరుపేదలైన వారికి ఇండ్ల స్థలాల కోసం ఇవ్వాలని కోరుతూ మంగళవారం స్థానిక ఆర్డిఓ కార్యాలయం ఎదుట సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సిపియం, ఇళ్ల స్థలాల పోరాట కమిటీ నాయకులు జగిత్యాల రూరల్ అర్బన్ మండల కేంద్రాలలో ఉన్న సర్వేనెంబర్ 107/1, 363 లో ఉన్న ప్రభుత్వ భూమిని జగిత్యాల నియోజక వర్గం పరిధిలోని నీరు పేద కుటుంబాలు ఇండ్లు లేక, ఇండ్ల కిరాయిలు చెల్లించలేక అనేక ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వ భూమిని నిరుపేద కుటుంబాలకు ఇండ్లు స్థలాలు ఇవ్వాలని ఆర్డీవో కార్యాలయంలో ఏవో కు వినతి పత్రాన్ని సమర్పించారు.

## కేరళ హైస్కూల్లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు



**కోరుట్ల సెప్టెంబర్ 05(ప్రజామంటలు):**
కోరుట్ల పట్టణంలోని ఐలాపూర్ రోడ్డు లో గల కేరళ హై స్కూల్లో సర్వేపల్లి రాధాకృష్ణ జన్మదిన సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ %హీూ% భారీ మాట్లాడుతూ ఉపాధ్యాయులె చరిత్ర నిర్మాతలని వారి సేవలు విద్యార్థి లోకానికి ఎంతో అవసరమని ఉపాధ్యాయులను కొనియాడుతూ వివిధ రంగాలలో డాక్టర్స్, ఇంజనీర్స్, వ్యాపారవేత్తలు మరియు సైన్టిస్టులుగా విద్యార్థుల ను తీర్చి దిద్దేవారు ఉపాధ్యాయులని, దేశ భవిష్యత్ విద్యార్థుల రూపంలో తరగతి గదిలోనే నిర్మించ బడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సెలీన్ వర్గీస్ మరియు ఉపధ్యాయ, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

# 2023-24 వార్షిక ప్రణాళిక ఖరారు



ఆదిలాబాద్ :2023-24 సంవత్సరానికి సంబంధించి రుణ పరిమితిని(స్కేల్ ఆఫ్ ఫైనాన్స్) తెలంగాణ రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంకు(టెస్కాబ్) జిల్లాలోని బ్యాంకులకు ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం బ్యాంకులు పంటల వారీగా ఇచ్చే రుణాలకు, సాగుకు అయ్యే పెట్టుబడికి పొంతన లేదని రైతులు అంటున్నారు. ఉమ్మడి జిల్లాలో 17.26 లక్షల ఎకరాల్లో 5.79 లక్షల మంది రైతులు పంటలు సాగు చేస్తున్నారు. వీరిలో 3.48 లక్షల మంది రైతులు మాత్రమే బ్యాంకుల నుంచి రుణాలు తీసుకొని పంటలు పండిస్తున్నారు. గతంతో పోలిస్తే జిల్లాలో సాగు విస్తీర్ణం ఏటా పెరుగుతోంది. ప్రతి రైతుకు రైతు బంధు కింద ప్రభుత్వం ఎకరానికి రూ.5 వేల చొప్పున పెట్టుబడి సాయం అందిస్తున్నా... బ్యాంకుల నుంచి రుణాలు తీసుకోవడంతోపాటు ప్రైవేట్‌గా రైతులు అప్పులు చేయాల్సి వస్తోంది. రుణ పరిమితి ఆధారంగా బ్యాంకులు వార్షిక రుణ ప్రణాళిక ఖరారు చేస్తున్నా.. ఆ మేరకు రుణాలు ఇవ్వడం లేదు. రుణ పరిమితి ఖరారు కావడంతో బ్యాంకుల వారీగా రుణ ప్రణాళికను రూపొందించడంలో అధికారులు నిమగ్నమయ్యారు. ఉమ్మడి జిల్లాలో 11 లక్షల ఎకరాలకుపైగా పత్తి సాగవుతుంది. ఇతర పంటలతో పోలిస్తే పత్తి రైతులకు రుణం ఎక్కువగా ఉంటుంది. గతేడాదితో పోలిస్తే ఎకరాకు రూ.5 వేలు పెంచి రూ.45 వేల లోపు రుణం ఇవ్వాలని నిర్ణయించారు. వర్షధారంగా సాగు చేసే రైతులకు రూ.42 వేలు ఇవ్వనున్నారు. విత్తనాలు, ఎరువులు, కూలీల ధరలు పెరగడంతో రూ.55 వేలకు పైగా ఖర్చు అవుతుందని రైతులు అంటున్నారు. తర్వాత ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేసే వరికి రూ.45 వేలు నిర్ణయించగా, సోయాకు ఎకరాకు రూ.28 వేలు లోపు ఇవ్వాలని ఖరారు చేశారు. పంటల సాగుతోపాటు వ్యవసాయ అనుబంధ రంగాలకు మంజూరు చేసే రుణపరిమితి చాలా తక్కువగా ఉంది. పాడి పశువులు కొనుగోలు చేసి డెయిరీ పెట్టుకోవాలనుకునే రైతులకు ఒక గేదె కొనుగోలుకు కేవలం రూ.27 వేల లోపు ఇవ్వాలని ఖరారు చేశారు. గొర్రెలు, మేకల కొనుగోలుకు ప్రోత్సాహం లేదు. చేపల ఫాం పెట్టుకోవడానికి హెక్టారుకు రూ.4 లక్షలు ఇవ్వాలని నిర్ణయించారు. కూరగాయలు సాగు చేసే రైతులకు టమాటాకు రూ.55 వేలు ఇవ్వాలని పేర్కొనగా, ఇతర కూరగాయలకు రుణ పరిమితి రూ.45వేల లోపు ఉంది. పండ్ల తోటలు సాగు చేసే రైతులకు రూ.75 వేల లోపు ఉండగా, పూల సాగుకు రూ.45 వేల లోపు ఉంది. జిల్లాలో గత రెండేళ్లుగా సాగు అవుతున్న ఆయిల్‌పామ్ తోటలకు గత ఏడాది ఎంత కేటాయించారో అంతే మొత్తాన్ని ఎకరాకు రూ.42 వేల లోపు ఇవ్వాలని నిర్ణయించారు. జిల్లా సాంకేతిక కమిటీ సమావేశంలో జిల్లాలో సాగు పరిస్థితులు, పెట్టుబడులు తదితర వాటిని పరిగణనలోకి తీసుకొని ప్రతిపాదనలు పంపడంతో కొద్ది చేర్పులు, మార్పులతో రాష్ట్ర కమిటీ ఆమోదం తెలిపిందని.. పంటల వారీగా రుణ పరిమితి ఉత్తర్వులను జారీ చేసిందని డీసీసీబీ సీఈఓ శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు.

# మినీ బ్యాంకులుగా.. రేషన్ దుకాణాలు!

నిర్మల్:ఇచ్చేవి సరిపోవడం లేదు.. కనీస వేతనాలు చెల్లించాలి.. ఉద్యోగ భద్రత కల్పించాలి..' ఇలాంటి డిమాండ్లతో రేషన్ డీలర్లు తరచూ ఆందోళనలు చేపడుతూనే ఉంటారు. వీటికి పూర్తిస్థాయిలో కాకపోయినా ఎంతోకొంత ఆదాయమార్గం చూపేందుకు ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలపై దృష్టి సారిస్తోంది. ఇందులో భాగంగానే రేషన్ దుకాణాలను మినీ బ్యాంకులుగా మార్చాలని నిర్ణయించారు. ఆ దిశగా కసరత్తు మొదలెట్టారు. తపాలా శాఖ వారి ఐపీపీబీ (ఇండియన్ పోస్టల్ పేమెంట్ బ్యాంకు) సహకారంతో రేషన్ దుకాణాల్లో పౌర సేవలను విస్తరించాలని నిర్ణయించారు. పట్టణ ప్రాంతాల్లో మినహాయిస్తే.. బ్యాంకింగ్ సేవలు అంతగా అందుబాటులో లేని గ్రామీణ ప్రాంతాల్లో ఇది ఉపయోగపడుతుంది. వినియోగదారులు తమ విద్యుత్తు, నల్ల, ఫోన్ తదితర బిల్లులను ఇక్కడ్నుంచే చెల్లించవచ్చు. నగదు, డిజిటల్ లావాదేవీలు కొనసాగించవచ్చు. దీనివల్ల ప్రజలకు బ్యాంకింగ్, డిజిటల్ సేవలు మరింత సులభంగా, సౌకర్యవంతంగా మారతాయి. 0-10 సంవత్సరాల్లోపు వారికి ఇక్కడ నుంచే ఆధార్ కార్డు జారీ చేయొచ్చు. ఉపాధిహామీ కూలీ డబ్బులు, ఆసరా పింఛన్లు పంపిణీ చేసే అవకాశం ఉంటుంది. రేషన్ డీలర్ల చరవాణిలో స్మార్ట్‌ఫోన్‌లో ఐపీపీబీ యాప్‌ను ఇన్‌స్టాల్ చేస్తారు. ప్రత్యేకంగా డిజిటల్ ఖాతా తెరవాలి. దీనిద్వారా రూ.10 వేల వరకు నగదు, డిజిటల్ లావాదేవీలు నిర్వహించొచ్చు. స్మార్ట్‌ఫోన్, అంతర్జాల వినియోగంపై అవగాహన ఉన్నవారికే ఇందులో అవకాశం కల్పించనున్నారు. ఇందుకోసం మండలాల వారీగా డీలర్లకు ముందస్తు అవగాహన కల్పిస్తారు. ఆపై ఆసక్తి ఉన్నవారి నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఈ నెల 31వ తేదీ లోపు దరఖాస్తులు పరిశీలించి, అనుమతి పొందిన వారికి ఎలాంటి డిపాజిట్ లేకుండానే ప్రతినిధిగా నియమించనున్నారు. ఆ తర్వాత వచ్చే వారికి రూ.5 వేలు డిపాజిట్‌గా స్వీకరించనున్నట్లు తెలుస్తోంది. వీరిని బ్యాంకు మిత్రగా



పేర్కొనే అవకాశముంది. లావాదేవీలు విస్తరిస్తే తదనుగుణంగా డీలర్లకు కమీషన్ విధానంలో అదనపు ఆదాయం సమకూరనుంది. ప్రతి లావాదేవీకి రూ.4 చొప్పున, నెలలో రూ.5 లక్షలు దాటితే మరో రూ.11 చొప్పున చెల్లించనున్నారు. ప్రతి నెలా పక్షం రోజులపాటు రేషన్ సరకులు పంపిణీ జరుగుతుంది. ఆ తర్వాత డీలర్లు ఖాళీగానే ఉంటారు. ఈ సమయాన్ని డిజిటల్ లావాదేవీలకు వినియోగించడం వల్ల సమయం కలిసొస్తుంది. ఆదాయమూ సమకూరుతుంది. మారుమూల ప్రాంతాలు, గ్రామాల్లో ఉన్నవారు బ్యాంకింగ్ సేవల కోసం పట్టణాలకు వెళ్లాల్సిన అవసరమూ ఉండదు. ఆసక్తి ఉన్న డీలర్లు తమ ఆధార్, పాన్‌కార్డు, నివాసం, ఆదాయ ధ్రువపత్రాలతోపాటు ఎలాంటి నేర చరిత్ర లేదని రూఢీ చేసేలా పోలీసు శాఖ నుంచి ఎన్‌ఓసీ పొందాలి. వీటన్నింటి ఆధారంగా మీ-సేవా కేంద్రాల్లో దరఖాస్తులు సమర్పించాలి. వాటిని పరిశీలించిన అనంతరం సంబంధిత అధికారులు అనుమతి జారీచేస్తారు. ఇప్పటికే పలువురు డీలర్లు దరఖాస్తు ప్రక్రియను ప్రారంభించారు.

# జోరుగా సారా విక్రయాలు



మార్కాపురం : నల్లమల అడవి మధ్యలో ఉన్న గిరిజన తాండాలు, సమీప గ్రామాల్లో నాటు సారా తయారీ జోరుగా సాగుతోంది. సెబ్ అధికారులు నిరంతర పర్యవేక్షణతో దాడులు చేస్తున్నప్పటికీ అక్రమార్కులు తమ పంథాను కొనసాగిస్తూనే ఉన్నారు. మార్కాపురం డివిజన్‌లో నల్లమల అటవీ ప్రాంతం లోని గిరిజన తాండాలే నాటుసారా ఉత్పత్తి కేంద్రాలు. ఎక్కువగా పుల్లలచెరువు, ఎర్రగొండపాలెం, దోర్నాల, అర్ధవీడు మండలాలలోని తాండాలలో నాటుసారా ఎక్కువగా తయారవుతుంది. కొందరు దీన్నే వృత్తిగా మార్చుకున్నారు. ప్రస్తుతం గ్రామాలలో నాయకులు తమ రాజకీయ అవసరాలను తీర్చుకోవడానికి గిరిజనులకు నాటుసారా తయారీకి అవసరమైన వస్తువులను సరఫరా చేసి తయారు చేయిస్తున్నారు. తెల్లతుమ్మచెక్క, నల్లబెల్లం మిశ్రమాన్ని మరికొన్ని పండ్లు, ఇతర సుగంధద్రవ్యాలు డమ్ములో కలిపి ముదుంగా మగ్గబెడతారు. దానిని 10 రోజులు అలానే ఉంచుతారు. తర్వాత బెల్లం ఊటను కుండలో పోసి కింద మంట పెడతారు. కుండపై నుంచి వచ్చే ఆవిరి ఒక గొట్టం ద్వారా బయటకు వచ్చేలా ఏర్పాటు చేస్తారు. అలా వచ్చిన ఆవిరిని తిరిగి చల్లబరచడం ద్వారా నాటుసారా తయారవుతంది. ఇలా ఒక లీటరు నాటుసారా తయారు చేయడానికి సుమారు రూ.500 వరకూ ఖర్చవుతుంది. ఇంత జరుగుతున్నా, సెబ్ అధికారులు ఇన్ని దాడు లు చేస్తున్నా అక్రమార్కులు తమ వైఖరి మార్చు కోవడం లేదు. అధికారుల కళ్లు కప్పి మరోప్రాంతంలో నాటుసారా తయారీని మళ్లీ ప్రారంభిస్తున్నారు. సెబ్ అధికారులు సారా తయారీ కేంద్రాలపై దాడుల చేసి వాటిని ధ్వంసం చేస్తున్నారేకానీ, అందుకు బాధ్యులపై చర్యలు తీసుకోకపోవడంతో మళ్లీ మళ్లీ చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నల్లమల అటవీ ప్రాంతంలో తయారైన నాటుసారా వివిధ మార్గాల ద్వారా మార్కాపురం పట్టణ శివారు కాలనీలోకి చేరుతోంది. ద్విచక్ర వాహనాలు, పాల వాహనాలు, అంబులెన్సులు ఎవరికి వీలున్న పద్ధతితో వారు తీసుకువస్తున్నారు. ఒక క్వార్టర్ బాటిల్ నాటు సారాను రూ.100 లకు విక్రయిస్తున్నారు. ప్రభుత్వ మద్యం దుకాణాలలో లభించే వైస్ జగన్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వచ్చిన బ్రాండ్ల కంటే నాటుసారా వైపే రోజువారీ కూలీలు మొగ్గు చూపుతున్నారు.

# పోలవరం మొదటి దశ ఎత్తు 41.15 మీటర్లే



న్యూఢిల్లీ బ్యూరో :పోలవరం ప్రాజెక్టు తొలి దశ నిర్మాణం 41.15 మీటర్ల ఎత్తు వరకేనని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ దశకు సంబంధించిన పరిహార చెల్లింపు, సహాయం, పునరావాస కల్పన ఇప్పటికీ పూర్తి కాలేదని పేర్కొంది. లోక్‌సభలో వైసిపి ఎంపీ భీశెట్టి సత్యవతి గురువారం నాడు అడిగిన ప్రశ్నకు కేంద్ర జలశక్తి సహాయ మంత్రి ప్రహ్లాద్ సింగ్ పటేల్ ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో ఈ విషయాలు తెలిపారు. పోలవరం ప్రాజెక్టు మొదటి దశ సహాయం, పునరావాసం ఈ నెలాఖరుకు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ పూర్తి కాలేదని ఆయన పేర్కొన్నారు. పోలవరం కింద మొత్తం 1.06 లక్షల నిర్వాసిత కుటుంబాలు ఉన్నాయని, తొలి దశ కిందకు 20,046 కుటుంబాలు వస్తాయని తెలిపారు. ఈ నెలాఖరు కల్లా మొదటి దశ కింద ఉన్న 20,046 కుటుంబాలకు పునరావాసం, పరిహారం అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. అయితే ఫిబ్రవరి నాటికి కేవలం 11,677 (55.74 శాతం) కుటుంబాలకే సహాయం, పునరావాసం కల్పించినట్లు ఆయన తెలిపారు. సహాయం, పునరావాసం జాప్యంపై సమయానుగుణంగా ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పోలవరం నిర్వాసితుల్లో 18 ఏళ్లు నిండిన వారిని ప్రత్యేక కుటుంబాలుగా గుర్తించాలని పలువురు దరఖాస్తు చేసుకున్నారని ఆయన పేర్కొన్నారు. 2005 ఏప్రిల్ 8న ప్రాజెక్టు ప్రాథమిక నోటిఫికేషన్ జారీ నాటికి 18 ఏళ్లు నిండిన వారే అందుకు అర్హులని ఆయన తెలిపారు. అయితే ప్రాథమిక నోటిఫికేషన్ తరువాత 18 ఏళ్లు నిండిన వారు ప్రత్యేక కుటుంబాల కింద అర్హులు కాబోరని పేర్కొన్నారు. దరఖాస్తుదారుల్లో అత్యధికులు వారే ఉన్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ రివైజ్డ్ కాస్ట్ కమిటీ పోలవరం ప్రాజెక్టు కోసం 1,27,263 ఎకరాల భూమిని సేకరించాల్సిన అవసరం ఉందని నిర్ధారించిందని, అయితే 2023 ఫిబ్రవరి నాటికి 1,13,119 ఎకరాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మిగిలిన భూసేకరణ వివిధ దశల్లో ఉందని తెలిపారు. ప్రస్తుత పూర్తి షెడ్యూల్ ప్రకారం, మిగతా భూమిని 2023 డిసెంబర్ నాటికి స్వాధీనం చేసుకుంటామని పేర్కొన్నారు.

# పుచ్చ రైతు కుదేలు..!

ఆరుగాలం కష్టపడి సాగుచేసిన పంట రైతు కళ్లముందే నాశనమైతే ఆ బాధ ఎలా ఉంటుందో మాటల్లో చెప్పలేం..ప్రస్తుతం పుచ్చ పంట వేసిన రైతుల గోడు ఇలాంటిదే.. తొలుత పాదులు పచ్చగా పెరగడంతో మంచి లాభాలు వస్తాయని ఆశించిన వారికి నిరాశే మిగిలింది. కాయ దశలో తెగుళ్లు దాడి చేశాయి. పోనీ మిగిలిన పంటనైనా దక్కించుకుందామనుకున్న తరుణంలో అకాల వర్షాలు నిలువునా ముంచాయి. వారం రోజులుగా పడుతున్న వానలకు పుచ్చకాయలు కుళ్లిపోవడంతో దిక్కుతోచని స్థితిలో పంటను పొలాల్లోనే వదిలేయాల్సిన దుస్థితి నెలకొంది.శ్రీకాకుళం డివిజన్ పరిధిలో లావేరు, రణస్థలం, ఎచ్చెర్ల, జి.సిగడాం, శ్రీకాకుళం మండలాల్లో దాదాపు 750 ఎకరాల్లో పుచ్చ పంట సాగు చేశారు. వేసవిలో మంచి గిరాకీ ఉన్న పంట కావడంతో జిల్లాలో రైతులు సాగుపై ఆసక్తి చూపుతున్నారు. ఏటా ఈ విస్తీర్ణం పెరుగుతూ వస్తోంది. స్థానిక అవసరాలతో పాటు ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. పంట వేసినప్పటి నుంచి బాగానే ఉన్నా, కాయ దశకు వచ్చేసరికి దెబ్బతినడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. నష్టపోయిన వారిని ప్రభుత్వమే ఆదుకోవాలని కోరుతున్నారు. ఉద్యాన, వ్యవసాయశాఖ అధికారులు గాని దెబ్బతిన్న పంట పరిశీలనకు రాలేదని, వారి జాడే లేదని వాపోతున్నారు. నాకున్న పొలంలో 8 ఎకరాల్లో పుచ్చ పంట సాగు చేయగా 4 ఎకరాల్లో పూర్తిగా దెబ్బతింది. తెగుళ్లు సోకి కాయ కుళ్లిపోవడంతో నివారణకు మందులు పిచికారీ చేశాం. కొంతమేరకు పంట బాగుందనుకున్న సమయానికి అకాల వర్షాలతో ఉన్న కాయలు కాస్త కుళ్లిపోయాయి. దీంతో పొలంలోనే వదిలేశాం. వ్యాపారులు పొలం వద్దకు వచ్చి కాయలు బాగాలేవని చెప్పి వెళ్లిపోతున్నారు. ప్రస్తుతం పెట్టుబడి కూడా రాని పరిస్థితి ఉంది. ఎకరా పొలంలో పుచ్చ పంట సాగు చేయాలంటే సుమారు రూ.70 వేల వరకు పెట్టుబడి అవసరం. దుక్కులు, ఎరువులు, విత్తనం,



మల్చింగ్ షీట్లు, కలుపు నివారణ మందులు, కూలీలు వంటి వాటితో కలిపి పంట చేతికి వచ్చేంతవరకు పెట్టుబడి అవుతుంది. పంట వేసినప్పటి నుంచి అన్నీ అనుకూలిస్తే రైతుకు పండగే. ఎకరాకు 20 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. ప్రస్తుతం ధర టన్నుకు రూ.10 వేలు పలుకుతోంది. మద్దతు ధర బాగున్నా, కాయలు దెబ్బతినడంతో పెట్టుబడి రాని దుస్థితి. చేతికొచ్చే సమయంలో తెగుళ్లు, వర్షాల వల్ల పంట నాశనమైందని రైతులు కన్నీటిపర్యంతమవుతున్నారు. పుచ్చకాయ మొక్కలు వర్షం ప్రభావంతో ప్రస్తుతం రంగుమారుతున్నాయి. నెలరోజుల కిందట వేసిన పంట వర్షానికి ముందు వరకు బాగుంది. తర్వాత వాడిపోవడంతో మొక్కలు చచ్చిపోతున్నాయి. ఇప్పటివరకు రూ.60 వేల వరకు మదుపు పెట్టాం. పంటను చూస్తే కన్నీళ్లు వస్తున్నాయి. అకాల వర్షాలకు గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను గుర్తిస్తున్నాం. శ్రీకాకుళం డివిజన్ పరిధిలో వర్షాలకు పుచ్చ పంట అంతగా దెబ్బతినలేదు. అంతకుముందు తెగుళ్లు సోకిన విషయం తెలిసిందే. నివారణకు సంబంధించి రసాయన మందులు పిచికారీ చేయాలని రైతులకు సూచించాం. వర్షాలకు దెబ్బతింటే నివేదికలు తయారు చేసి ఉన్నతాధికారులకు నివేదిస్తాం.

# ఆసుపత్రుల్లో అమలు కాని భోజన మెనూ

భీమవరం: భీమవరం ప్రాంతీయ ఆసుపత్రిలో ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స పొందుతున్న రోగులకు ఆహారాన్ని ఉదయం 12.30 నుంచి 1 గంట సమయంలో ఆసుపత్రికి తీసుకొచ్చారు. అప్పటికే కొందరి బంధువులు ఇళ్ల నుంచి తీసుకొచ్చిన భోజనాన్ని రోగులకు వడ్డించారు. ప్రభుత్వం గుత్తేదారు ద్వారా అందించిన ఆహార పదార్థాలను పరిశీలిస్తే అన్నం, ఒక కూర, సాంబారు, పెరుగు ప్యాకెట్, అరటి పండు ఉన్నాయి. అరటిపండు, పెరుగు కొన్నిరోజులు ఉండవని, కూర, సాంబారుతో సరిపెడతారని పలువురు ఆరోపించారు. నిత్యం 25 నుంచి 30 మందికి ఆహారం అవసరమవుతుందని వైద్య అధికారులు చెప్పారు. గత కొన్నేళ్లుగా బిల్లులు రావడం లేదని గుత్తేదారు చెబుతున్నారు. సాధారణ రోగులకు రూ.39, ఆరోగ్యశ్రీలో ఉన్నవారికి రూ.80 చొప్పున చెల్లిస్తున్నారని, ఇప్పటి వరకు రూ.8 లక్షల వరకు బకాయిలు ఉన్నాయన్నారు. కొత్తవారికి అప్పగిస్తే పాత బకాయిలు వస్తాయో రావోననే భయంతోనే కొనసాగిస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం ఒక్కో రోగికి రూ.100 వరకు చెల్లించేలా కొత్తగా ఉత్తర్వులు వచ్చాయని ఆసుపత్రి పర్యవేక్షకుడు ఎం.వీరాస్వామి చెప్పారు. టెండరు పిలిచామని, వాటిని జిల్లా సంయుక్త కలెక్టర్ సమక్షంలో గురువారమే పరిశీలించారని వెల్లడించారు. నరసాపురం ప్రాంతీయ ఆసుపత్రిలో మెనూకు మంగళం పాడారు. నిత్యం మధ్యాహ్నం 12 నుంచి 1 గంట లోపు అందించే



భోజనంలో అన్నంతోపాటు 150 గ్రాముల పప్పు, ఆకుకూర, 100 గ్రాముల కూరగాయల కూర, 150 మిల్లీలీటర్ల సాంబారు, 200 మిల్లీలీటర్ల మజ్జిగ, అరటిపండు అందించాల్సి ఉంది. గురువారం శనగల కూర, సాంబారు, పెరుగు, మాత్రమే ఇచ్చారు. ఉదయం అల్పాహారంతో కోడిగుడ్డు ఇచ్చారు. నిత్యం మెనూ పాటించకుండా ఇస్తున్నారని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు చెబుతున్నారు. ఇన్‌పేషెంట్లు 12 మంది ఉన్నారని ఆసుపత్రి సిబ్బంది తెలిపారు. పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రిలో పాత మెనూనే అమలు చేస్తున్నారు. గురువారం సాధారణ రోగులకు తోటకూర పప్పు, బంగాళ దుంప వేపుడు, రసం, పెరుగు అందించారు. (

# కాలువ నీరున్నా.. ప్రయోజనం సున్నా!



ముదిగుబ్బ :ముదిగుబ్బ మండలం చుట్టూ నీరున్నా అన్నదాతలకు మాత్రం సాగునీటి కష్టాలు తీరడం లేదు. హెచ్ఎన్ఎస్ఎస్ కాలువ నీరు వెళ్తున్నా చెరువులకు నింపకపోవడంతో ఏటేటా పంటల సాగు తగ్గిపోతోంది. ఇక్కడి ప్రజలు ఉపాధి దొరక్క బెంగళూరు, పులివెందుల ప్రాంతాలకు వలసపోవడం ఇక్కడ పరిపాటిగా మారుతోంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే విస్తీర్ణంలో అతిపెద్ద మండలం ముదిగుబ్బ. 86 గ్రామాలు, 62 వేల మంది జనాభా ఉన్నారు. అడవిబ్రాహ్మణపల్లితండా సమీపంలో 1 టీఎంసీ సామర్థ్యంతో నిర్మించిన యోగివేమన జలాశయం కింద 12 వేల ఎకరాల ఆయకట్టుకి నీరందుతోంది. ఏటా వర్షాకాలంలో జలాశయం గేట్లు ఎత్తడంతో వేల క్యూసెక్కుల నీరంతా వృథాగా చిత్రావతిలోకి పోతోంది. ఆయకట్టు భూములు సాగునీటితో కళకళలాడుతున్నా మిగిలిన గ్రామాల్లో మాత్రం సేద్యానికి సాగునీటి కొరత ఏర్పడింది. ప్రధాన ఆధారమైన హెచ్ఎన్ఎస్ఎస్ కాలువ నీటితోనైనా చెరువులు నింపితే భూగర్భజలాలు పుష్కలంగా లభించి వ్యవసాయం సాగుతోనైనా వలసలు తగ్గే అవకాశముంది. ముదిగుబ్బ-బుక్కపట్నం సరిహద్దులో 2.41 టీఎంసీల సామర్థ్యంతో నూతనంగా జలాశయాన్ని నిర్మిస్తున్నా కొండగట్టుపల్లి నుంచి మల్లేపల్లి పంచాయతీ వరకు ఉన్న 15గ్రామాల ప్రజలకు ఎటువంటి ఉపయోగం లేదు. ముదిగుబ్బ మండలంలో హంద్రీనీవా సుజల స్రవంతి పథకం కింద 14వ ప్యాకేజీతో మలకవేముల నుంచి నాగారెడ్డిపల్లి వరకు 2 కిలోమీటర్లు కాలువ నిర్మించారు.

# నీటి పొదుపు, సంరక్షణ తప్పనిసరి

చిత్తూరు:ఎండలు మండిపోతున్నాయి.. భూగర్భజలాల మట్టం తగ్గి నగరంలో పలుచోట్ల బోర్లలో నీటి మట్టం పడిపోతోంది.. శాశ్వత నీటి పథకాలు లేని జిల్లా కేంద్రానికి ఎన్టీఆర్ జలాశయమే దిక్కు.. వరదలతో నిండే ఈ జలాశయం నుంచి ఆర్నెల్లకు వరకు నగరానికి నీటిని సరఫరా చేయాల్సిన పరిస్థితి.. ఇక ఈ ప్రాజెక్టులో నీరు ఖాళీ అయితే బిందెడు నీటికి నగర ప్రజలు అష్టకష్టాలు పడాల్సిన దుస్థితి మొదలవుతుంది. నివాస ప్రాంగణాల్లో ఇంకుడు గుంతల నిర్మాణాన్ని అందరూ మరిచారు. పాత కాలంలో ఉపయోగించే ఈ పద్ధతిలో భూమిలో నీరు ఎల్లప్పుడూ ఉండేది. నగరంలో 40వేలకు పైగా నివాసాలు ఉన్నాయి. ప్రతి ఇంట్లో ఒక ఇంకుడుగుంత నిర్మిస్తే



భవిష్యత్తులో నీటి సమస్య ఏర్పడదు. అతి తక్కువ ఖర్చుతో దీన్ని ఏర్పాటు చేసుకోవచ్చు. ఇందుకు రూ.7వేల నుంచి రూ.8వేలు వెచ్చించాలి. తొలుత ఇంట్లో బోరు పక్కన మూడు అడుగుల గుంత తీయాలి. ఈ గుంతలో పట్టేలా సిమెంటుతో రింగులుగా తయారు చేసుకోవాలి. వాటిని ఈ గుంతలో దించాలి. రింగు రింగుకు మధ్య కాంక్రీటు, సిమెంటు మాత్రమే వినియోగిం చాలి. అనంతరం అలాగే విడిచిపెట్టి దీనిపై ఒక కప్పు పెట్టుకోవాలి. ఇంటి పైకప్పుపై పడే వర్షపు నీటిని ప్రత్యేక పైపు ద్వారా ఈ గుంతలోకి మళ్లించేలా ఏర్పాటు చేసుకోవాలి. నగరంలో వివిధ ప్రాంతాల్లో నగరపాలక, ప్రైవేటు శుద్ధీకరణ కేంద్రాలు(మినరల్ వాటర్ ప్లాంట్) వెలిశాయి. వీటి నుంచి నిత్యం లక్షల లీటర్ల నీరు వృథాగా మురుగునీటి కాలువల్లో విడిచిపెడుతు న్నారు. ప్రతి కేంద్రం వద్ద ఇంకుడుగుంతలు నిర్మిస్తే ఆ నీరు భవిష్యత్తులో ఉపయోగించుకునే వీలుం టుంది. ఆయా కేంద్రాల నిర్వాహకులు ఆలోచించి వృథానీరు వెళ్లే స్థలంలో ఇంకుడుగుంతలు ఏర్పాటు చేసుకుంటే భావితరాలకు నీరు అందించిన వారమవుతాం. నగరంలో 80 కిమీ వరకు పైప్‌లైన్ల ద్వారా నివాసాలు, పబ్లిక్ కుళాయిల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. పాత పైప్‌లైన్లు విరిగి, తుప్పుపట్టి వాల్వ్‌ల వద్ద నీరు లీకవుతోంది. గంటల తరబడి ఇలా నీరు వృథాగా రోడ్లపై పోతోంది. దీన్ని స్థానికులు తమ కాలనీల్లో గుర్తించి నగరపాలక అధికారులు, సిబ్బందికి సమాచారం ఇవ్వాలి.

# లక్షల లీటర్ల శుద్ధ జలం వృథా

కరీంనగర్ :ఎస్ఆర్ఆర్ కళాశాల ఎదురుగా బ్యాంకు కాలనీకి వెళ్లు కూడలిలో పైపులైను వాల్వ్ ఉంది. ఇటీవల మరమ్మతులు చేసినా ఎప్పటిలాగే శుద్ధి నీరంతా రోడ్డుపై ప్రవహిస్తోంది. ఆ ప్రాంతంలో బురద మయంగా మారుతుండటంతో రాకపోకలు సాగించే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అసలే ఎండాకాలం.. ఆపై జలం అవసరాలు పెరిగిపోవడం.. ప్రతి ఒక్కరూ నల్లా నీరు ఎప్పుడు వస్తుందా అని ఎదిరి చూస్తుండగా.. పైపులైన్ల లీకేజీలు.. వాల్వుల దగ్గర బయటకు వస్తున్న శుద్ధజలంతో.. లక్షల లీటర్ల నీరు వృథా అవుతోంది. కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలోని 60 డివిజన్లు ఉండగా అత్యధిక శాతం కాలనీలకు శుద్ధి నీరే పంపిణీ చేస్తున్నారు. గతంలో రోజు విడిచి రోజు వచ్చే నల్లా నీరు ప్రస్తుతం రోజు వస్తుండటంతో నగరవాసులకు నీటి సమస్యనే లేదు. విలీన కాలనీల్లో కొన్నింటికి నగరం నుంచే తాగునీరు పంపిణీ అవుతుండగా మిగతా ప్రాంతాలకు మిషన్ భగీరథ, స్థానికంగా ఉన్న బోరు, బావుల నీటిని సరఫరా చేస్తున్నారు. నల్లా నీర ఒక రోజు రాకపోయినా ఆయా ప్రాం తవాసులు ఎదురు చూసే పరిస్థితి ఏర్పడింది. పాత నగరంలో బోరు, బావులు లేకపోవడంతో అన్ని అవసరాలకు ఈ నీరే అధికంగా వాడుతున్నారు.. అంతరాయం లేకుండా సరఫరా చేయాల్సి ఉండగా ఈ మధ్య మరమ్మతుల పేరిట నిలిపి వేస్తుండటంతో ఇబ్బందులు తప్పడం లేదు. నగరంలోని కాపువాడ, ఆమేర్‌నగర్, మారుతీనగర్, పాతబజారు, బోయవాడ, అహ్మద్‌పుర, భగత్‌నగర్, కశ్మీర్‌గడ్డ, గోదాంగడ్డ, రాంనగర్, సప్తగిరికాలనీ, శివనగర్, అంబేద్కర్‌నగర్, మంచిర్యాల చౌరస్తా, హౌసింగ్‌బోర్డుకాలనీ, సిక్కువాడీ, దోబీవాడ, కట్టరాంపూర్, కోతిరాంపూర్, అలకాపురికాలనీ, విద్యానగర్, జ్యోతినగర్, మంకమ్మతోట, విద్యానగర్, ఖాన్‌పుర, హుస్సేనీపుర, అశోక్‌నగర్, బ్యాంకుకాలనీ, మెహర్‌నగర్, సుభాష్‌న



గర్, సవారన్‌వీధి, వావిలాలపల్లి తదితర ప్రాంతాల్లో వాల్వుల లీకేజీలు అధికంగా ఉన్నాయి. అందులో నీరు నిలిచి ఉండటంతో తిరిగి పైపులైన్లకు వెళ్తోందని అంటున్నారు. ప్రధాన రహదారులపై పైపులు పగిలి నీరంతా రోడ్లపై ప్రవహిస్తుండగా మరమ్మతులు చేయడంలో జాప్యం చేస్తున్నారు. నగరంలోని పలు ప్రాంతాల్లో స్మార్ట్‌సిటీ రహదారులు నిర్మిస్తున్నారు. వేసిన రోడ్లు భవిష్యత్తులో పగులకొట్టకుండా ఉండేందుకు కొత్తగా హెచ్‌డీపీఈ పైపులు వేస్తున్నారు. రెండు పైపులను అనుసంధానం చేసే సమయంలో జాయింట్లు సక్రమంగా చేయడం లేదు. నిపుణులతో కాకుండా స్థానిక కార్మికులతోనే ఈ పనులు చేయిస్తుండటంతో సీసీ వేసిన తర్వాత లీకేజీలు బయట పడుతున్నాయి. పలు స్మార్ట్ రోడ్లపై ఇప్పటికే ఉన్నాయి. మంచిర్యాల చౌరస్తా సమీపంలో మసీదుకు ఎదురుగా అంబేద్కర్‌నగర్ రిజర్వాయర్‌కు వెళ్లు దారిలో పైపులైను లీకవుతోంది. నెలల తరబడి అలాగే ఉండగా శుద్ధి నీరంతా మురుగునీటి కాల్వల్లోకి వెళ్తోంది. ప్రధాన పైపులైను కావడంతో దానిని ముట్టుకోకుండా వదిలేస్తుండటంతో కొన్ని సందర్భాల్లో ఫౌంటెయిన్ తరహాలో నీరు పైకి లేస్తోంది.

# అందని సాయం.. అన్నదాతల అయోమయం

ఆదిలాబాద్ :పట్టా పాసుపుస్తకం పొందిన రైతుల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో చేర్చకపోవడం, నిబంధనల మేరకు కొంత మంది రైతుల పేర్లను తొలగించడంతో పీఎం కిసాన్ యోజన కింద సాయం పొందే రైతుల సంఖ్య తగ్గిపోతోంది. రైతుబంధు పథకం మాదిరిగానే.. కేంద్ర ప్రభుత్వం పెట్టుబడి సాయంగా ఏటా ఎకరానికి రూ.2 వేల చొప్పున మూడు విడతల్లో రూ.6 వేలు పెట్టుబడి సాయంగా రైతుల ఖాతాల్లో జమచేస్తోంది. జిల్లాలో చాలా మంది రైతులకు పీఎం కిసాన్ యోజన కింద రైతుల ఖాతాల్లో డబ్బులు జమ కావడం లేదు. ఎందుకు రావడం లేదనే వివరాలను మండల, జిల్లా స్థాయిలో చెప్పేవారే లేరు. ఇలాచాలా మంది రైతులు డబ్బులు జవకాక ఆందోళన చెందు తున్నారు.కేంద్ర ప్రభుత్వం 2018 ఫిబ్రవరి1న పీఎం కిసాన్ యోజన పథకాన్ని ప్రవేశపెట్టింది. ప్రారంభం నుంచి ఇప్పటి వరకు 13 దఫాలుగా రైతులకు సాయం అందింది. రాష్ట్ర ప్రభుత్వం మాదిరిగా పట్టా పాసు పుస్తకం ఉన్న ప్రతి రైతుకు కాకుండా కొన్ని నిబంధనల మేరకు పీఎం కిసాన్ నిధులు జమ అవుతున్నాయి. గతేడాది కొత్తగా పథకం కింద నగదు పొందాలంటే ప్రతి రైతు ఈకేవైసీని చేసుకోవాలని సూచించింది. ఇందుకు మూడు నెలలు గడువు ఇచ్చింది. అవగాహన లేని రైతులు కొంత మంది ఇప్పటి వరకు ఈకేవైసీని సమర్పించలేదు. 90 శాతం పూర్తి చేసుకున్నా.. కొంత మంది రైతుల ఖాతాల్లో నిధులు జమ కాకపోవడం పట్ల వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైతుల ఖాతాల్లో కాకుండా కుటుంబీకుల ఖాతాల్లో జమ కాగా, మరి కొంత మందికి జమ చేసినట్లుగా సంక్షిప్త సందేశం వచ్చినా బ్యాంకు ఖాతాల్లో నిధులు జమ కాలేదు. ఈ విషయమై ఎవరిని సంప్రదించాలో తెలియని పరిస్థితి ఉంది. కొత్తగా పట్టాపాసు పుస్తకాలను తీసుకున్న రైతులు 10 వేల



మందికి పైగా ఉన్నారని అధికారులు అంటున్నారు. ఈ విషయంపై దృష్టి సారించి, సమస్యను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళితే మేలు జరుగుతుందనే అభిప్రాయాన్ని రైతులు వ్యక్తం చేస్తున్నారు. ఈకేవైసీ చేసుకోవడంతో నిబంధనల ప్రకారంగా అనర్హుల సంఖ్య మాత్రమేతగ్గిందని అధికారులు అంటున్నారు. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసే పీఎంకిసాన్ నిధులు జమ చేయడంలో ప్రభుత్వం కొన్ని నిబంధనలు అమలు చేస్తోంది. బ్యాంకు ఖాతాలకు ఆధార్‌అనుసంధానం లేని రైతుల ఖాతాల్లో నిధులు జమ కాలేదు. ఆదాయం పన్ను చెల్లించే వారినిపథకంలో నుంచి తొలగించారు. రేషన్‌కార్డుల ప్రకారంగా కుటుంబంలో ఒక్కరికే పథకాన్ని అమలు చేయడం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, నెలకు రూ.10 వేల కంటే అధికంగా పింఛను తీసుకునేవాళ్లని క్రమంగా తొలగిస్తున్నారు. నిబంధనల మేరకు అనర్హులను గుర్తిస్తూ పథకం నుంచి తొలగిస్తుండ టంతో లబ్ధిదారుల సంఖ్య తగ్గుతోందని అధికారులు అంటున్నారు.

## నెల రోజుల్లో 1.90 మీటర్లు

# తగ్గిన భూగర్భ నీటిమట్టం



నిర్మల్ :ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి మాసంలో నిలకడగా ఉండి, ఈ నెలలో రెండు మీటర్లకుపైగా దిగజారిపోవడం ఆందోళన కలిగిస్తోంది. జిల్లాలో ఏర్పాటుచేసిన 42 ఫిజోమీటర్ల ద్వారా నీటి లెక్కింపు చేసి నివేదిక విడుదల చేశారు. అత్యధికంగా ఆరు మండలాల్లో జలం పడిపోయి ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. నీటిని పొదుపు చేయకుండా అవసరానికి మంచి నీటిని వాడటంతో భూగర్భం విచ్ఛిత్తికి గురవుతోంది. నిరంతర విద్యుత్తు సరఫరాతో మోటార్ల ద్వారా ఎక్కువ నీటిని వినియోగిస్తుండటంతో గతంలో ఎన్నడూ లేని విధంగా నీటి మట్టం పడిపోవడం ప్రమాద సంకేతాన్ని సూచిస్తోంది. నీటి సంరక్షణ కోసం చర్యలు చేపట్టకపోవడంతో రోజురోజుకు భూగర్భజల మట్టం పడిపోతుంది. ఫలితంగా తాగు, సాగునీటి కోసం ఇక్కట్లు ఎదుర్కోవాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఈ ఏడాది జనవరి నెలాఖరునకు జిల్లాలో సగటున 6.50 మీటర్ల లోతులో భూగర్భ జలం ఉండగా.. ఫిబ్రవరి నెలాఖరునకు 8.40 మీటర్లకు పడిపోయింది. రానున్న రోజుల్లో భూగర్భజలం మరింత పాతాళానికి చేరుకునే ప్రమాదం నెలకొంది. ఓవైపు నిరంతర విద్యుత్తు సరఫరా.. మరోవైపు వాగులు, ఒర్రెల, నదుల నుంచి నిరంతరంగా ఇసుక తవ్వకాలు చేపట్టడంతో భూగర్భజలం కిందకు దిగజారిపోతుండటం ప్రమాదాన్ని సూచిస్తోంది. భూగర్భజలం పడిపోతుండటంతో వాటి పరివాహక ప్రాంతాల్లోని బోర్లలో నీరు రాకపోవడం పంటలపై ప్రభావం చూపుతోంది. జిల్లాలో 95 వేల ఎకరాల్లో మొక్కజొన్న, 92 వేల ఎకరాల్లో వరి, 12 వేల ఎకరాల్లో నువ్వులు, మరో 30 వేల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తున్నారు. ఇందులో 50 వేల ఎకరాలకుపైగా పంటలు బోర్లపై ఆధారపడి సాగు చేస్తున్నారు. నిరంతరంగా విద్యుత్తు సరఫరా చేస్తుండటంతో చాలా ప్రాంతాల్లో అన్నదాతలు పంటలకు నీరు అవసరం లేకున్నా పంపుసెట్లను నడిపిస్తున్నారు. అవసరం మేరకు సాగునీటి వాడుకునే విషయంలో అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తే కొంతవరకైనా మేలు జరుగుతుంది. వేసవి ఆరంభంలోనే నీటి కష్టాలు మొదలవుతున్నాయి. గతేడాది పుష్కలంగా వర్షాలు కురియడంతో పంటల సాగు విస్తారంగా జరుగుతోంది. యాసంగి సీజన్‌లోనూ వరి పంటలు సాగు చేస్తుండటంతో బోర్ల ద్వారా నీటి వాడకం ఎక్కువ అవుతోంది. మండుతున్న ఎండల కారణంగా ఆవిరి రూపంలో 30 శాతం నీరు కనుమరుగవుతోందని భూగర్భజలశాఖ అధికారులు చెబుతున్నారు. ఏప్రిల్ నెలాఖరులో, మే నెలలో జిల్లాలో భూగర్భ జలమట్టం 12 నుంచి 14 మీటర్లకు పడిపోయే ప్రమాదం ఉందని భూగర్భజల శాఖ అధికారులు వెల్లడిస్తున్నారు. జిల్లాలో భూగర్భజలాలు రోజురోజుకు పడిపోతూనే ఉన్నాయి. తాగునీటికి అత్యవసరం అనుకుంటే మినహా బోరుబావి తవ్వించొద్దు. భూగర్భంలోని నీటి పొరల్లో నీటి లభ్యత తగ్గిపోవడంతోనే బోరుబావుల ద్వారా నీరు రావడం నిలిచిపోతుంది. రైతులు తమ పంటపొలాల్లో నీటి నిల్వ కోసం గుంతలు తవ్వుకుంటే వర్షాకాంలో నీరు నిలిచి భూగర్భజలాలు వృద్ధి చెంది సాగునీటికి ఇబ్బందులు ఏర్పడవు.

## అలా తీసుకొని.. ఇలా అమ్మేస్తున్నారు..

# చౌకధరల దుకాణాల ఎదుటే దళారుల కొనుగోలు



మంచిర్యాల :రేషన్ కార్డులో ఒక్కో లబ్ధిదారునికి ప్రస్తుతం ప్రభుత్వం 5 కిలోల చొప్పున నలుగురు ఉంటే 20 కిలోలు ఇస్తున్నారు. ఆ బియ్యం తీసుకున్న లబ్ధిదారుడు చౌకధరల దుకాణం వద్ద సిద్ధంగా ఉన్న దళారులకు కిలోకు రూ.12 చొప్పున అమ్ముతున్నారు. ఆ దళారీ బియ్యం కొనుగోలు చేసి ఇలా ఆటోలో తీసుకొస్తున్నారు. జిల్లాలో రేషన్ బియ్యం పక్కదారి పడుతున్నాయి. ఇప్పటివరకు లబ్ధిదారులు రేషన్ బియ్యం తీసుకుని ఇంటికి వెళ్లిన తర్వాత దళారులకు అమ్ముకునే వారు. ఆ బియ్యాన్ని వారు మహారాష్ట్రకు తరలించి అధిక ధరకు అమ్మి సొమ్ము చేసుకునేవారు. తాజాగా రేషన్ దుకాణాలు తెరిసే సరికే దళారులు అక్కడ సిద్ధంగా ఉంటున్నారు. లబ్ధిదారులు తీసుకున్న వెంటనే అక్కడే దళారులకు అమ్ముతున్నారు. ఇంకొన్నిచోట్ల ఆ బియ్యాన్ని డీలర్లే కొని లబ్ధిదారులకు ఆన్‌లైన్ ద్వారా డబ్బులు పంపిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.జిల్లాలో పౌరసరఫరాల శాఖ అస్తవ్యస్తంగా మారింది. అధికారుల పర్యవేక్షణ లేక రేషన్ బియ్యం బహిరంగంగా పక్కదారి పడుతున్నాయి. ప్రభుత్వం ప్రతి నెల మండల గిడ్డంగుల నుంచి రేషన్ దుకాణాలకు పంపించి లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్నారు. వీటిని ప్రతి నెల ఒకటో తేదీ నుంచి 15వ తేదీలోపు ఒక్క రూపాయికి కిలో చొప్పున లబ్ధిదారులకు డీలర్లు పంపిణీ చేయాలి. గత కొన్ని నెలలుగా బియ్యం ఆలస్యంగా సరఫరా చేయడంతో ప్రతి నెల గడువు పొడిగిస్తున్నారు. ఈ క్రమంలో ఇప్పుడు రేషన్ డీలర్లు దళారులకు అండగానిలుస్తున్నారు. లబ్ధిదారులు కొనుగోలు చేసిన బియ్యం ఆ దుకాణం ముందే దళారులకు రూ.12కి కిలో చొప్పున అమ్ముతున్నారు. కొందరు డీలర్లు ఇప్పుడు అక్రమ బియ్యం దందా చేస్తున్నారు. లబ్ధిదారులకు పంపిణీ చేయాల్సిన రేషన్ బియ్యానికి బదులు, డీలర్లే రూ.8కిలో చొప్పున కొనుగోలు చేస్తున్నారు. ఆ డబ్బులను లబ్ధిదారు లకు ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తున్నారు. మరికొందరు బియ్యంకు బదులు నిత్యావసర సరకులు ఇస్తున్నారు. ఆ బియ్యాన్ని డీలర్లు మళ్లీ దళారులకు రూ.15కు కిలో చొప్పున అమ్ముకుంటున్నారనే ఆరోపణలున్నాయి.

తూకం వేసిన తర్వాతనే వేలిముద్ర వేస్తే ఈ-పాస్ యంత్రం నుంచి రశీదు వస్తుంది. డీలర్లు బియ్యంతో తూకం వేయకుండా బాట్ల బరువు పెట్టి వేలిముద్రలు తీసుకుంటున్నారు. డీలర్లకు ప్రభుత్వం ఇచ్చే కమీషన్ కంటే, బియ్యం అక్రమ దందాతో ఆదాయం పెంచుకుంటున్నారు.

జిల్లా ఉన్నతాధికారులు స్పందించి రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. మంచిర్యాలలో మరికొంతమంది దళారులు రేషన్ దుకాణాల ముందు కొనుగోలు చేసిన బియ్యం ద్విచక్ర వాహనాలపై ఓ రహస్య స్థలానికి తరలిస్తున్నారు. ఎక్కువబియ్యం ఒకేసారి తీసుకెళ్తే అధికారులు పట్టుకుంటారనే ఉద్దేశంలో ఇలా రెండు మూడు బస్తాలు తరలిస్తున్నారు.

# భగీరథ గుంతలు.. వాహనదారుల తిప్పలు

ఆదిలాబాద్ :నేతాజీచౌక్‌లో మిషన్ భగీరథ పైప్‌లైన్ కోసం తవ్వినపుడు ఏర్పడిన గుంత. ఏడాదవుతున్నా ఇప్పటిదాకా మరమ్మతు చేయక వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు జిల్లా కేంద్రంలో మిషన్ భగీరథ పైప్‌లైన్ కోసం తవ్విన గుంతలకు మరమ్మతులు చేయకుండా అలాగే వదిలేశారు. బాగున్న బీటీ, సీసీ రోడ్లు పాడై వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మరమ్మతులు చేయాలని స్థానిక కౌన్సిలర్ల నుంచి అధికారులకు ఫిర్యాదులు వస్తున్నాయి. మిషన్ భగీరథ పనులను ప్రజారోగ్య ఇంజినీరింగ్ శాఖ చేపడుతుండటంతో మరమ్మతులను సైతం వారే చేపట్టాల్సి ఉంది. గతంలో ఈ పనులు చేపట్టిన గుత్తేదారు మరమ్మతులు చేయకుండా చేతులెత్తేశారు. రెండేళ్లుగా భగీరథ గుంతలతో పట్టణవాసులు నానా తిప్పలు పడుతున్నారు. పట్టణంలో ప్రతి ఇంటికి శుద్ధ జలం సరఫరా చేసేందుకు ప్రభుత్వం మిషన్ భగీరథ కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ పనులను పబ్లిక్ హెల్త్ అండ్ ఇంజినీరింగ్ శాఖ పర్యవేక్షిస్తోంది.

2016లో పనులు దక్కించుకున్న గుత్తేదారు పట్టణ అంతర్గత రహదారులను తవ్వి పైప్‌లైన్ వేశారు. బల్దియా యంత్రాంగం పైనుంచి రోడ్లు వేశారు. పైప్‌లైన్ పనుల్లో సాంకేతిక లోపాలు, లీకేజీ సమస్యలు, ట్రయల్ రన్‌పేరుతో బాగున్న రోడ్లను మళ్లీ తవ్వాల్సి రావడంతో ఎక్కడ చూసినా గుంతలే కనిపిస్తున్నాయి. వాస్తవానికి గుంతలకు మరమ్మతులు చేయా



ల్సిన బాధ్యత గుత్తేదారుదే. రహదారులపై గుంతల కారణంగా పట్టణవాసులు ఇబ్బందులు పడుతుండడంతో గతేడాది బల్దియా యంత్రాంగం సొంతనిధులతో మరమ్మతులు చేయాలని నిర్ణయించిం ది. ఇందుకోసం రోడ్డు కటింగ్ ఛార్జీలను రూ.80 లక్షలు వెచ్చించింది. ప్రజారోగ్య ఇంజినీరింగ్ శాఖ వారే చేయాల్సిన పనులకు బల్దియా నిధులు వెచ్చించడంపై అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. దీంతో ఆ పనులు నిలిచిపోయాయి. మరమ్మతులు చేయాలని కౌన్సిలర్లు పదేపదే బల్దియా అధికారులకు చెప్పడం, వారు పబ్లిక్ హెల్త్ ఇంజినీరింగ్ అధికారుల దృష్టికి తీసుకుపోతున్నా పనులు మాత్రం జరగడం లేదు.

# అక్కరకు రాని ఆరోగ్య ఉపకేంద్రాలు!

ఆసిఫాబాద్: పల్లె ప్రాంతవాసులకు మెరుగైన వైద్యం అందిస్తారనే ఆశయం నెరవేరడంలేదు. గ్రామీణ ప్రాంత ఆసుపత్రులపై ప్రభుత్వం దృష్టి సారిస్తున్నా.. ఆశించినస్థాయిలో వైద్యం సేవలందడంలేదు. అయిదారేళ్ల కిందట నిర్మించిన ఆరోగ్య ఉపకేంద్రాలు నేటికీ నిరుపయోగంగా ఉండి క్రమంగా శిథిలావస్థకు చేరుకోవడమే దీనికి నిదర్శనం. ఈ కేంద్రాలు ప్రజలకు ఏనాడూ అక్కరకు రాలేదు. జిల్లాకు రెండేళ్ల క్రితం కొత్తగా 39 ఆరోగ్య ఉప కేంద్రాలు మంజూరు కాగా.. 26 ఉపకేంద్రాల పనులు పూర్తయ్యాయి. కొత్తవి సైతం ప్రారంభానికి నోచుకోలేకపోతున్నాయి. పల్లె దవాఖానాలుగా మార్చినా, సిబ్బందిని నియమించకపోవడంతో ఈ భవనాల కోసం వెచ్చించిన రూ.కోట్లు బూడిదలో పోసిన పన్నీరు చందంగా మారాయి. జ్వరాలు విజృంభిస్తున్న ప్రస్తుత తరుణంలోనైనా తగిన సిబ్బంది, వైద్యులను నియమించాలని ప్రజలు కోరుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 20 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 108 ఆరోగ్య ఉపకేంద్రాలు ఉన్నాయి. కాగజ్‌నగర్‌లో రెండు పట్టణ ఆరోగ్య కేంద్రాలు ఉండగా.. 46 మంది వైద్యులు అవసరం కాగా, 24 ఖాళీలు ఉన్నాయి. ఆరోగ్య ఉపకేంద్రాలను పల్లె దవాఖానాలుగా మార్చారు. ఇంతకు ముందు నిర్మించి రంగులు వేసి ప్రారంభించకుండా ఉన్న వాటికి, మళ్లీ రంగులు వేసి నిధుల దుబారాకు తెర తీశారు. ఇంత చేసినా.. ఇక్కడ మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లను నియమించకపోవడంతో.. చిన్నపాటి రోగాలకు సైతం సుదూరంలో ఉన్న మండల కేంద్రాలు, పట్టణాలకు పరుగులు తీయాల్సి వస్తోంది.

ఇవి అందుబాటులో వస్తే మారుమూల గ్రామాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలందే వీలవుతుంది.ఇదీ పరిస్థితి.. జైనూర్, సిర్పూర్(యు), లింగాపూర్ మండలా లు పూర్తిగా ఏజెన్సీ ప్రాంతాలు. జైనూర్ సీహెచ్‌సీలో



ఎనిమిది మంది వైద్యులు ఉండాలి కానీ ప్రస్తుతం ఒక్కరే ఉన్నారు. ఆసిఫాబాద్ వైద్యుడికే ఉషేగాం బాధ్యతలు అప్పగించారు.

లింగాపూర్, సిర్పూర్(యు)లలో ఇదే పరిస్థితి. జైనూర్ సీహెచ్‌సీలో గర్భిణులకు చేయాల్సిన స్కానింగ్ సక్రమంగా చేయడం లేదు. పక్షం రోజులకు, నెలకోసారి చేయడంతో స్కానింగ్ కోసం మహిళలు సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన దుస్థితి. సిర్పూర్(టి) సీహెచ్‌సీ కేవలం రోగులను రిఫర్ చేయడానికే పనిచేస్తోందని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇక్కడ ఆరుగురు వైద్యులు పనిచేయాల్సి ఉండగా.. కేవలం ముగ్గురు ఉన్నారు. స్టాఫ్ నర్సులు 29, ల్యాబ్ టెక్నీషియన్లు 7,బహుళార్థ ఆరోగ్య కార్యకర్తలు 69 పోస్టులు సైతం ఏళ్ల తరబడి ఖాళీలుగానే ఉన్నాయి.



# ఈ ఫొటోలను ఇంట్లో పెట్టుకుంటున్నారా..?

సాధారణంగా ఇంట్లో కొన్ని వస్తువులను పెట్టుకుంటే శుభమని, కొన్ని వస్తువులను పెట్టుకోవడం వల్ల అశుభమని చెడు ఫలితాలు కలుగుతాయని నానుడి. ఎంత కష్టపడినా చేతిలో చిల్లు గవ్వ మిగలడం లేదని బాధపడే వారు మనలో మంది ఉండే ఉంటారు. అలాగే కొన్ని వస్తువులు, ఫోటోలు మంచిని సూచిస్తే, కొన్ని చెడును ఆహ్వానిస్తాయి. చెడును ఆహ్వానించే వస్తువులను ఇంట్లో నుండి తొలగిస్తే మంచిది. అలాగే ఇంటిని పరిశుభ్రంగా ఉంచడం వల్ల ఇంట్లోకి పాజిటివ్ ఎనర్జీ వస్తుంది. కొన్ని వస్తువులను తెలిసో తెలియకో ఇంట్లో కనుక పెట్టుకుని ఉంటే వెంటనే తొలగించడం మంచిది. వీటిని తొలగించడం వల్ల సంతోషం, మనశ్శాంతి లభిస్తాయి. ఈ వస్తువులను కనుక తొలగించకపోతే అవి ఇంట్లోకి నెగెటివ్ ఎనర్జీని తీసుకువస్తాయి. ఆరోగ్యంగా అలాగే ఆర్థికంగా కూడా ఇవి దెబ్బతీస్తాయి. ఇంట్లో ఉంచకూడని వస్తువులు ఏమిటో ఇప్పుడు తెలుసుకుందాం. ఇంట్లో కనుక ఏడుస్తున్న బాలుడు లేదా బాలిక పెయింటింగ్స్ ఉంటే వాటిని వెంటనే తొలగించాలి. ఇవి దురదృష్టానికి సంకేతం. వీటిని ఇంట్లో పెట్టుకోకూడదు. అలాగే ఇంట్లో పూలు, పండ్లు లేని చెట్లను ఉంచుకోకూడదు. ఇవి కూడా దురదృష్టాన్ని సూచిస్తాయి. సాధారణంగా నటరాజుని పెయింటింగ్ ను కూడా చాలా మంది ఇంట్లో ఉంచుకుం టారు. ఇది మంచిగా కళాత్మకంగా ఉన్నప్పటికీ ఇది కూడా చెడును సూచిస్తుంది. తాండవ నృత్యం అంటే వినాశనానికే నృత్యం అని సూచిస్తుంది.

Printed And Published By V.Narsingam, On Behalf Of Ch.V. Prabhakar Rao And Printed At Sri Sharadha Offset Printers. H.No.9-14/8/3, Buggaram Village And Mandal, Buggaram Gramapanchayath- 505454, Jagtial District, Telangana State.. Published At 6-6-206,Padma Nagar, Jagtial - 505327, Jagtial District, Telangana State.
Editor : Ch V. Prabhakar Rao, Rni T.C. Teltel 2021/81092 Phone : 9391533339 Email: Prajamantalu@Gmail.Com